ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 29 అక్టోబరు 2024





* రాయితీ కోసం రైతులు ఎదురు చూపు
* ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ ఇచ్చిన వ్యవసాయ శాఖ
* 50 శాతం రాయితీ కోరుతున్న అన్నదాతలు

నరసరావుపేట ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలం



శనగ.. విత్తనం ఏదీ..?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో తుఫాన్‌ల ప్రభావంతో అతి భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పత్తి పైరు కొన్ని ప్రాంతాల్లో తుడిచిపెట్టుకు పోయింది. ఖరీఫ్‌లో పంటలు కోల్పోయిన రైతులు రబీ సాగు పైనే ఆశలు పెట్టుకున్నారు. శనగ సాగుకు సమాయత్తమయ్యారు. శనగ విత్తేందుకు పొలాలను అన్నదాతలు సిద్ధం చేశారు. అయితే, రబీ సీజన్ ప్రారంభమై వారాలు గుడుస్తున్నా విత్తన సరఫరా లేదు. ప్రభుత్వం 25శాతం మాత్రమే శనగ విత్తనానికి రాయితీ ఇస్తుందని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటిస్తుండటంతో అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. ఖరీఫ్‌లో పంటలు కోల్పోయిన తమకి, 50 శాతం సబ్సీడిపై శనగ విత్తనం సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

శనగ సాగు ఇలా..

జిల్లా	సాధారణ (విస్తీర్ణం ఎకరాల్లో)	గత ఏడాది సాగు
బాపట్ల	80,365	69,655
పల్నాడు	25,810	45,363
గుంటూరు	21,380	27,410

రబీలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో విస్తృతంగా శనగ సాగు చేస్తారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కూడా శనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలకు పత్తి పంట వేలాది ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయిన విషయం తెలిసిందే. అధిక వర్షాలకు ఉన్న పంట దిగుబడులు కూడా అంతంత మాత్రం గానే ఉన్నాయి. తొలి కాపు పూర్తి అయిన పత్తి పంటను రైతులు తొలగించి వేసి ఆ పొలాల్లో శనగ సాగు చేపట్టనున్నారు. ఈ మేరకు భూములను సిద్ధం చేస్తున్నారు. బాపట్ల జిల్లాల్లో శనగ సాధారణ విస్తీర్ణం 80,365 ఎకరాలు, పల్నాడు జిల్లాల్లో 25,810, గుంటూరు జిల్లాలో 21,380 ఎకరాలు సాధారణ విస్తీర్ణంగా వ్యవసాయ శాఖ వెల్లడించింది. అయితే పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పత్తి సాగు ఖరీఫ్‌లో గణనీయంగా తగ్గింది. వేలాది ఎకరాల్లో పత్తి పంట వర్షాలకు దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో సదరు రైతులు శనగ సాగు చేస్తారని, దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేసింది. ఈ మేరకు విత్తనం కోసం వ్యవసాయ శాఖ ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పంపింది. ఏపీ సీడ్స్ నుంచి ఇంకా విత్తనం సరఫరా కాలేదని వ్యవసాయ అధికారులు తెలిపారు. 25 శాతంపై శనగ విత్తనం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని విత్తన నిల్వలు రాగానే పంపిణీ ప్రారంభిస్తామని వారు పేర్కొన్నారు.

రాయితీ 25 నుంచి 50 శాతంకు పెంచాలి

ఖరీఫ్‌లో పంటలు కోల్పోయిన నష్టపోయిన బాధిత రైతులు శనగ విత్తనం రాయితీ 50 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వైసీపీ ప్రభుత్వం గతంలో ఉన్న శనగ విత్తనం రాయితీని 50 నుంచి 25 శాతానికి తగ్గించింది. మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో రాయితీని పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే 25 శాతం రాయితీపై శనగ విత్తనం పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. కాగ్ 2 రకం విత్తనం క్వింటా ప్రైవేట్ మార్కెట్‌లో రూ 9 వేల ధర పలుకుతోంది. ఈ విత్తనం ధరను ఏపీ సీడ్స్ క్వింటా రూ. 12,100గా నిర్ణయించింది. 25 శాతం రాయితీ పోను రైతులు 9,075 చెల్లించాలి. జేజీ 11 రకం అసలు ధర రూ.9,400గా నిర్ణయించారు. రాయితీ పోను క్వింటాల్‌కు రూ 7050 చెల్లించాలి. ఈ రెండు రకాలు ప్రైవేట్ మార్కెట్ కంటే ఏపీ సీడ్స్ ఎక్కువ రేటు ప్రకటించిందని రైతులు తెలిపారు. ప్రైవేట్ మార్కెట్‌కు అనుగుణంగా విత్తన ధరను నిర్ణయించాలని, 50 శాతం రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఏపీ సీడ్స్ ప్రకటించిన ధరలను కూడా తగ్గించాలన్న డిమాండ్ రైతుల నుంచి వినిపిస్తోంది. వెనువెంటనే ఎకరాకు 40 కేజీల చొప్పున శనగ రాయితీపై విత్తన సరఫరాను ప్రారంభించా లని రైతులు కోరుతున్నారు. విత్తన సరఫరాలో మరో వారం రోజులు జాప్యం జరగవచ్చనే అభిప్రాయం వ్యవ సాయ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

పేదలకు పట్టెడన్నం కావాలంటే రేషన్‌కార్డు కావాలి. పండుటాకులకు కూసింత భరోసా దక్కాలంటే పింఛన్లు కావాలి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా ఇప్పటి వరకూ వాటి ఊసే లేకుండా పోయింది. దీంతో జనసామాన్యం వాటి కోసం ఆశగా ఎదురు చూస్తోంది. వైసీపీ హయాంలో అకారణంగా రేషన్ కార్డులు, పింఛన్లు కోల్పోయి, తిరిగి పొందడం కోసం ఆశగా కూటమి ప్రభుత్వం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.



* రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం సామాన్యుల ఎదురు చూపులు
* 8 నెలలుగా నిలిచిపోయిన దరఖాస్తు ప్రక్రియ
* ఎన్నికల కోడ్‌తో మార్చిలో ఆగిపోయిన వైనం
* అప్పటి నుంచీ ఫ్రీజింగ్‌లోనే ప్రభుత్వ వెబ్‌సైట్లు
* గత ప్రభుత్వ ఏరివేతతో కార్డులు, పింఛన్లు కోల్పోయిన ప్రజలు
* ఇదిగో.. అదిగో అనుకుంటూనే ఐదు నెలలు గడిపేసిన కొత్త ప్రభుత్వం
* ఒత్తిడి పెరగడంతో ఆఫ్‌లైన్ దరఖాస్తులతో ఎమ్మెల్యేల ఊరడింపు

మోక్షమెప్పుడు?

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ ఒక్కసారిగా రూ.3నుంచి 4వేలకు పెరిగింది. దాంతోపాటు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. వీటిలో ఏ పథకం పొందాలన్నా రేషన్‌కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోవడం అనాదిగా వస్తున్న విధానం. దీంతో ప్రతి ఒక్కరూ పింఛన్లు, రేషన్ కార్డులకోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన పింఛనుదారులు, కార్డుదారులే అధికంగా ఉన్నారు. వారికి తోడు వైసీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్నా కార్డులు రానివారు, తాజాగా అర్హత పొందినవారు జతయ్యారు. వారంతా ఇప్పుడు పింఛన్లు, రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే గత మార్చిలో వచ్చిన ఎన్నికల కోడ్ కారణంగా దరఖాస్తు ప్రక్రియ ఆగిపోయింది. ఆ తరువాత ప్రభుత్వం మారి కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల దరఖాస్తు ప్రక్రియను తిరిగి పునరుద్ధరించలేదు. వెబ్‌సైట్లన్నింటినీ అచేతన స్థితిలో పెట్టింది. ఇలా పెట్టిన ప్రభుత్వం ఐదు నెలలు పూర్తయినా దాన్ని తొలగించలేదు. దీంతో రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వీలే లేకుండాపోయింది.

● మూడు జిల్లాల్లో 25వేల దరఖాస్తులు పెండింగ్..

గత వైసీపీ ప్రభుత్వం రకరకాల నిబంధనలు ప్రవేశపెట్టి పింఛనుదారులు, కార్డుదారుల్లో భారీగా కోతలు పెట్టింది. సగటున ప్రతి పది మందిలో ఒకరు అర్హత కోల్పోయి ఇబ్బందులకు గురయ్యారు. వారు అప్పట్లోనే పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం పదే పదే తిరస్కరించింది. గత రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. కొత్తగా రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడం, పేర్లు చేర్చుకోవడం, కార్డును విభజించుకోవడం వంటి సదుపాయాలు లేక ఏళ్ల తరబడి ప్రజలు ఎదురు చూడాల్సి వచ్చింది. చివరి ఏడాదిలో వైసీపీ ప్రభుత్వం అవకాశం కల్పించినా అవి దరఖాస్తు దశలోనే ఆగిపోయాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అనేక మంది రేషన్ కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ వారి దరఖాస్తులు ఇప్పటికీ పెండింగులోనే ఉన్నాయి. అందుతున్న సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ దరఖాస్తులు 2 లక్షలకు పైగా పెండింగులో వున్నాయని, గుంటూరు, పల్నాడు, బాపట్ల మూడు జిల్లాల్లో కలిపి 25వేల దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని తెలుస్తోంది. వారంతా ఎనిమిది నెలలుగా కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు కానీ ప్రభుత్వం నుంచి ప్రకటన మాత్రం రావడంలో లేదు. ఇదిగో అదిగో అంటూనే కొత్త ప్రభుత్వం ఐదు నెలల కాలాన్ని నెట్టేయడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. తాజాగా దీపావళి నుంచి ఉచిత గ్యాసు సిలిండర్ పథకం అమలు కావడం, దానికి రేషన్ కార్డునే ప్రామాణికంగా వుంటుందని తెలుస్తుండడంతో ఈ డిమాండు మరింత పెరిగింది.

ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ఒత్తిడి

పింఛను, రేషన్ దరఖాస్తుల కోసం కూటమి పార్టీల కార్యాలయాలకు వచ్చేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వుంది. ప్రధానంగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయాల్లో వీరి తాకిడి అధికంగా వుంది. రోజువారీ దరఖాస్తుల్లో ఈ రెండు విభాగాల నుంచే 70 శాతానికి పైగా దరఖాస్తులు వస్తున్నాయి. దీంతో ఒత్తిడిని తట్టుకోలేని ఎమ్మెల్యేలు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. తమ కార్యాలయంలో ఒకరిని ఆ పని కోసం కేటాయించి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు తీసుకుని వారి పేర్లు నమోదు చేసి ఒక జాబితాను రూపొందిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారుల్లో ఒకింత ఊరట కనిపిస్తున్నా ఈ ప్రక్రియ తమకు ఉపయోగపడుతుందా.. లేదా అన్న అనుమానమూ ప్రజల్లో వ్యక్తమవుతోంది.

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యుల ఎన్నికలకు అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సీ-2025 ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ-2025 ఎన్నికలకు ఓటరుగా నమోదుకు నవంబరు 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు ఓటరుగా నమోదు కావడానికి 2024 నవంబరు 1వ తేదీ నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి మూడు సంవత్సరాలు అయి ఉండాలన్నారు. 2021 నవంబరు 1వ తేదీ నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని స్పష్టం చేశారు. సాధారణ డిగ్రీలతో పాటు పదవ తరగతి తరువాత మూడు సంవత్సరాల డిప్లొమా చేసిన వారు ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గతంలోనిఓటరు జాబితాను పరిగణలోకి తీసుకోరని, అందువలన ప్రతి ఒక్కరు నూతనంగా ఓటు కోసం ఖచ్చితంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు ఉందన్నారు. ఏఈఆర్‌ఓలు బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి పరిశీలన చేసి గ్రాడ్యుయేట్‌లను ఓటరుగా నమోదు చేయించాలన్నా రు. అలా గే జిల్లా కార్యాలయాల హెచ్‌ఓడీలు తమ కార్యాలయ గ్రాడ్యుయేట్ సిబ్బంది ఓటరుగా నమోదు చేసుకున్నారో, లేదో తనిఖీ చేయా లన్నారు. కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి సభ్యుల ఎన్నికలకు గుంటూరు జిల్లా లో ఇప్పటివరకు 39 వేల దరఖాస్తులు మాత్రమే అందాయని, నవంబర్ 6 లోపుగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మె ల్సీ ఓటర్లను నమోదు చేసే లక్ష్యంతో ఏఈఆర్వోలు క్షేత్రస్థాయిలో విస్తృత స్థాయిలో అర్హత ఉన్న ఓటరుకు అవగాహన కల్పించి, ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, డీఆర్‌వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మికుమారి, గంగరాజు, ఆర్‌డీవో శ్రీనివాసరావు, శేషశ్రి, చేనేత, జౌళి శాఖ ఏడీ వనజ, డీఎస్‌ఓ కోమలి పద్మ, పంచాయితీ రాజ్ ఎస్‌ఈ గుర్రం బ్రహ్మయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

* 2047 విజన్ డాక్యుమెంట్ బాగుంది
* ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరాకు నేటి నుంచే బుకింగ్స్
* నీటిపై తేలియాడే రెస్టారెంట్ల అభివృద్ధికి చర్యలు
* పర్యాటక యాత్రలు కూడా ప్రవేశపెడుతున్నాం
* డీఆర్‌సీ సమావేశంలో ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్

జిల్లాని మొదటి స్థానంలో నిలుపుతాం

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్ళేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అమలుచేస్తామని ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాలులో ఆయన అధ్యక్షతన జిల్లా మండలి సమావేశం జరిగింది. సమావేశంలో ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్ల పథకం, స్వర్ణాంధ్ర 2047 జిల్లా విజన్ యాక్షన్‌ప్లాన్, వ్యవసాయం, ఉద్యానం, ఇరిగేషన్, మార్కెటింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఇన్‌చార్జి మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ చరిత్రాత్మకమైన రాజధాని ప్రాంతంలో భాగమై ప్రత్యేకత ఉన్న, కీలకమైన గుంటూరు జిల్లాకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలిసి తనను ఇన్‌చార్జి మంత్రిగా నియమించడం అనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంచి బకాయిలతో సహా అందించామన్నారు. సాధారణ పింఛన్లు రూ.4వేలకు, పూర్తిగా మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15,000 పెన్షన్ పెంచామన్నారు. రైతులకు అండగా ఉండటం కోసం గత ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.1600కోట్ల బకాయిలు తీర్చాం.. ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ పౌర సరఫరాలశాఖకు సంబంధించి దీపావళి నుంచి ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇచ్చే కార్యక్రమాన్ని అమలుచేస్తామన్నారు.

వికసిత్ భారత్ లో భాగంగా స్వర్ణాంధ్ర 2047లో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలుకు కింది నుంచి ఉన్నత స్థాయి పాలసీలో భాగంగా గ్రామసభలు నిర్వహించి ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించటం జరిగుతుందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విధానరూపకల్పన చేయటంతోను సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. జిల్లాలో పర్యాటకరంగంలోని అవకాశాలను మెరుగుపర్చి అభివృద్ధి పరిచేలా చర్యలు చేపడతాం. జిల్లాపై ప్రాథమికంగా అవగాహన కల్పించటానికి తొలి డీఆర్సీ సమావేశం ఉపయోగపడిందని, సమావేశంలో చర్చించిన అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లోని అంశాలు బాగున్నాయని, వీటిపై ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. విజన్ డాక్యుమెంట్‌లోని అంశాలతో పాటు స్థానికంగా మౌలిక సౌకర్యాల కల్పనకు సంబంధించి, అధునీకరణ, అభివృద్ధికి సంబంధించి కార్యక్రమాలు అమలుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో అమరావతి రాజధాని ప్రాంతం ఉండటంతో మౌలిక సౌకర్యాలు, లాజిస్టిక్ హబ్ ఏర్పాటుకు ఫోకస్‌గా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకం దీపావళి నుంచి ప్రారంభించటం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నాలుగు నెలలకు ఒకసారి చొప్పున ప్రతి సంవత్సరానికి మూడు సిలెండర్లకు చెల్లించిన నగదును లబ్ధిదారుని అకౌంట్‌కు 48 గంటల్లో జమ చేయటం జరుగుతుందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండరు పథకానికి అక్టోబరు 29వ తేదీ ఉదయం 10 గంటల నుంచి బుకింగ్ ప్రారంభించటం జరుగుతుందని, నవంబరు 1వ తేదీ నుంచి డెలివరీలు ప్రారంభమౌతాయన్నారు. నగరంలోని బీఆర్ స్టేడియం, పీవీకే నాయుడు, మనస సరోవరం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌలురైతుల కోసం సాగుదారునికే పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో అన్ని శాఖలపై క్షుణ్ణంగా సమీక్షించేందుకు వీలుగా ప్రతి డీఆర్సీ సమావేశంలో రెండు అంశాలపైనే సమీక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక విధానం నూరు శాతం పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయటం జరిగిందన్నారు. నిబంధనలు ఉల్లఘించితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. డీఆర్సీలో చర్చించిన అంశాలను రానున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు. రహదారులపై ఉన్న గుంతలను నవంబరు నాటికి పూడ్చివేసే కార్యక్రమంను సక్రమంగా అమలు చేయాలన్నారు.

కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి జిల్లాకు సంబంధించిన పూర్తి వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకానికి సంబంధించి అవగాహన, ఫిర్యాదుల కోసం జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌కు సంబంధించి వ్యవసాయం, అనుబంధ రంగాలు, సర్వీస్ సెక్టార్‌లో ఎకానమీ గ్రోత్ ప్రణాళికలు వివరించారు. జిల్లాలో ల్యాండ్‌బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంగళ గిరిలో అక్రమ ఇల క్రమబద్దీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నా రు. దుగ్గిరాల శుభం కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పసుపు రైతులకు పరిహారం అందించేందుకు క్వింటాకు ప్రభుత్వం రూ.7వే లు అందించాలని ప్రకటించిందని, ఇన్సూరెన్స్ క్లెయిమ్ ప్రధా న కార్యాలయంలో అమోదంపొందే ప్రక్రియ పూర్తైన వెంటనే రైతులకు నగదు అందించేలా చర్యలుతీసుకుంటామన్నారు.

● ఎమ్మెల్సీ పంచుమూర్తి అనురాధ మాట్లాడుతూ మంగళగిరిలో ఇరిగేషన్, అటవీ, రైల్వే భూములలో 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నవారికి స్థలాలు రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ల అర్హతలు, బుకింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫిర్యాదుల పరిష్కారినికి జిల్లాలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాకు కీలకమైన టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో శంకుస్థాపన చేసిన పనులకు ఇసుక అందించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు తిరిగి ప్రారంభించాలన్నారు.

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ పోలాలు ముంపేకి ముదునూరు నిర్వహణకు నల్లమడ, నల్ల ఛానల్ ఆధునీకరణ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలోని స్టార్టప్ కంపెనీల ఉత్ప త్తులను ప్రభుత్వం ప్రొక్యూర్ చేసేలా టెండరు నిబంధనలు సవరించితేనే మేకిన్ ఆంధ్రప్రదేశ్ సాధ్యం అవుతుందన్నారు.

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో పూర్తిగా మౌలిక సౌకర్యాలు కల్పిస్తే అక్కడ నైపుణ్య కేంద్రాలను ఏర్పాటుచేసి యువతకు పూర్తిస్థాయిలో శిక్షణ అందించవచ్చొన్నారు. మానససరోవరంను పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. నగరంలో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిష్టినా, జేసీ ఏ భార్గవ తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్‌వో పెద్ది రోజా, గుంటూరు ఆర్‌డీవో కె శ్రీనివాస రావు, డీఎస్‌వో కోమలి పద్మ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, జిల్లా మార్కెటింగ్ ఏడీ రాజబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు , గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్ర, మత్స్య శాఖ ఏడి గాలి దేముడు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, జిల్లా ఉపాధి కల్పనా ధికారి వీ రమా దేవి, సమగ్ర శిక్ష ఏపీడీ విజయ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ యం ఉమా దేవి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జిల్లా మండలి సమావేశానికి హాజరైన ఇన్‌ఛార్జ్ మంత్రి దుర్గేష్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

పంచారామ భక్తులకు మెరుగైన బస్సు సౌకర్యం


ఈవో సునీల్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం రవికుమార్, రామకృష్ణ

అమరావతి, అక్టోబరు 28: నవంబరు 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస పర్వదినాల్లో పంచారామ పుణ్యక్షేత్రాల్లో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించే భక్తులకు ఆర్టీసీ మెరుగైన బస్సు సౌకర్యాన్ని కల్పిస్తుందని గుంటూరు రీజినల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. సోమవారం అమరేశ్వరస్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి పి. సునీల్‌కుమార్‌ను ఆర్ఎంతోపాటు డీఎం రామకృష్ణ కలిసి అమరావతికి బస్సులు నడపడంపై చర్చించారు. ప్రత్యేకంగా దూరప్రాంతాల నుంచి పంచారామాలు సందర్శించే భక్తులకు ఇతర క్షేత్రాలు సందర్శించేలా ఆలయంలో ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఈవో సునీల్‌కుమార్ తెలిపారు. పాలకొల్లు నుంచి బయలుదేరి సాయంత్రానికి అమరావతి చేరుకునే భక్తులకు పది గంటల వరకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పిస్తామని ఈవో చెప్పారు. పంచారామాలకు కేటాయించిన బస్సుల సమాచారాన్ని ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేయాలని ఆర్టీసీ అధికారులను కోరారు. విజయవాడ వైపు నుంచి వచ్చే బస్సులను గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్ మీదుగా అమరావతి చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఆర్ఎం తెలిపారు. గుంటూరు నుంచి కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పాతకక్షల నేపథ్యంలో యువకుని హత్య


వివరాలను సేకరిస్తున్న సీఐ శ్రీనివాసరావు

దుర్గి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో యువకుని హత్య మండలంలోని అడిగొప్పులలో జరిగింది. గ్రామానికి చెందిన షేక్ సైదా (28) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామ శివారులో సైదా తన స్నేహితులైన ఒప్పిచర్ల జాని, నగీషాలతో మద్యం తాగాడు. ఈ క్రమంలో సైదా, జానిల మధ్య ఘర్షణ జరిగింది. కాగా జాని గ్రామంలోకి చేరుకుని తన స్నేహితుడైన శివకృష్ణకు జరిగిన ఘర్షణను వివరించాడు. శివకృష్ణ వెంటనే సైదాకు ఫోన్ చేసి మాట్లాడగా వీరివురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో జాని, శివకృష్ణ ద్విచక్ర వాహనంపై గ్రామంలోని సెంటర్లో బేకరి వద్ద ఉన్న సైదా వద్దకు చేరుకున్నారు. శివకృష్ణ తనతో తెచ్చుకున్న కత్తితో సైదా ఛాతిపై పొడిచాడు. దీంతో సైదా కింద పడిపోయాడు. స్థానికులు సైదాను దుర్గిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దుర్గి పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. హత్య సంఘటనపై దుర్గి సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన హుస్సేన్, జానీబాషా, శివకృష్ణ స్నేహితులని, హుస్సేన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు చెప్పారు. అయితే హుస్సేన్ మూడు నెలల క్రితం సైదా భార్య ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్ పెట్టగా, ఆ సమయంలో పెద్దలు రాజీ కుదిర్చి హుస్సేన్ చేత సైదా భార్యకు క్షమాపణ చెప్పించారన్నారు. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న హుస్సేన్ తన స్నేహితులతో సైదాను హత్య చేయించి ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోందని సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక వికాసానికి దోహద పడతాయని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం యడ్లపల్లిలోని ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ అంతర్ జిల్లాల అండర్-17 బాలబాలికల చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ చదరంగం నేర్చుకుంటే జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో తెలుస్తుందని తెలిపారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, విశ్లేషణ, అవగాహనా శక్తి చెస్ ఆట వలన పొందవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ క్రీడాకారులకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలై మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సరైన కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన చెస్ క్రీడాకారులను అభినందించారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకి తోడ్పాటు అందించిన ఎన్నారై శివరామప్రసాద్, రావి సాయిబాబాలను ఆయన అభినందించారు. విద్యార్థులతో కలిసి చెస్ ఆడారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి ఆర్.చలపతిరావు అధ్యక్షత వహించారు. పాఠశాల హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ చెస్ పోటీలను రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 130 మంది చెస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆర్ఐపీవో డాక్టర్ మహబూబ్ బాషా, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి షేక్ కరీముల్లా, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేమూరి శరత్‌బాబు, టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, ఎంఈవో-2 సాల్మన్‌రాజు, సర్పంచి ముంతాజ్, భగవద్గీత, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి మరింత కృషి


గుంటూరు సర్కిల్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఉద్యోగులు

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లా కేంద్రం గుంటూరు రింగ్‌రోడ్డులోని కార్యాలయంలో రెండు సర్కిల్స్‌కు సంబంధించి నూతన కార్యవర్గ ఎన్నికలకు సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పీహెచ్ ఖాన్ తెలిపారు. కాగా అసోసియేషన్ గుంటూరు సర్కిల్ అధ్యక్షుడుగా కేవీ సుబ్బారావు, కార్యదర్శిగా జి.బ్రహ్మయ్య, ట్రెజరర్‌గా సీహెచ్ వీరారెడ్డి కాగా సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లకు కూడా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలానే అసోసియేషన్ సీఆర్‌డీఏ సర్కిల్ అధ్యక్షుడుగా ఎన్.నాగమల్లేశ్వరరావు, కార్యదర్శిగా ఎన్ .చిలకారాజులు కాగా సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-2 డివిజన్, అమరావతి డివిజన్‌లకు కూడా నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్‌శాఖలో ఇంజనీర్లు పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

రైలు కిందపడి ఆత్మహత్యా యత్నం

రేపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని వేమూరు మండలం చంపాడు గ్రామానికి చెందిన మోటుపల్లి చైతన్య కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిపై ఇతరులకు కౌలుదారుల కార్డులను అందించటమే కాకుండా ప్రశ్నించిన తనపై తప్పుడు కేసులు పెడుతున్న వీఆర్‌వో సీతయ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మోటుపల్లి చైతన్య కుమార్, అనుష గతంలో బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడిని కోరారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న వీఆర్‌వో సీతయ్యపై రెండు సార్లు ఎస్పీకి, ఒకసారి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు కేసు విచారణ నిమిత్తం మోటుపల్లి అనూష, మోటుపల్లి చైతన్య కుమార్, కాకాని కన్యాకుమారిని పిలిపించారు. అధికారులపై కేసుపెట్టారని, దానిలో మిమ్మల్ని ముద్దాయిలుగా గుర్తించామని, నోటీసులు తీసుకోవాలని డీఎస్పీ అన్నారని తెలిపారు. మనస్తాపం చెందిన ఈ ముగ్గురు రేపల్లె రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి మృతి చెందే ప్రయత్నం చేయగా, రైల్వే పోలీసులు గుర్తించి వారిని బయటకు లాగారు. మందలించి వారి గ్రామమైన చంపాడు వెళ్లమని సూచించారు. అక్రమంగా వ్యవహరించిన వీఆర్‌వో సీతయ్యపై చర్యలు తీసుకోకుండా తమపై చర్యలు తీసుకోవటం ఏమిటంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఆస్తి కోసం కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ

- ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- ఇద్దరికి గాయాలు


షేక్ మహమ్మద్ బాషా (పాతచిత్రం)

క్రోసూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదాల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన క్రోసూరు మండలం హసానాబాద్ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హసానాబాద్ గ్రామానికి చెందిన మీరాబీకి, అదే గ్రామానికి చెందిన హుస్సేన్ సాహెబ్‌తో 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి మహమ్మద్ బాషా జన్మించాడు. తరువాత వారిద్దరి మధ్య విభేదాలు రావటంతో భర్తతో విడాకులు తీసుకొని తమ్మవరం గ్రామానికి చెందిన నాగూల్ మీరాను వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి జన్మించారు. అమ్మాయి చనిపోగా మరో అమ్మాయికి వివాహం చేశారు. చిన కుమారుడు అబ్దుల్ బాసిత్, మొదటి భర్త కుమారుడు మహమ్మద్ బాషా కూడా తల్లితో కలసి ఉంటున్నాడు. ఇటీవల కాలంలో మహమ్మద్ బాషాకు వివాహం కావటంతో వేరేగా ఉంటున్నాడు. మహమ్మద్ బాషాకు తన తండ్రి ద్వారా రెండు ఎకరాల పొలం, రెండు సెంట్ల స్థలం ఆస్తి లభించగా, రెండో భర్త కుమారుడికి 50 సెంట్ల స్థలం, రెండు సెంట్ల స్థలం రెండో భర్త ద్వారా లభించాయి. ఆస్తి మొత్తం కలిపి సమానంగా తీసుకోవాలని తల్లితో సహా రెండో కుమారుడు అబ్దుల్ బాషిత్ గొడవ పడుతూ వస్తున్నారు. ఉమ్మడిగా ఆస్తి తీసుకోవటానికి మహమ్మద్ బాషా అంగీకరించకపోవటంతోపాటు ఎవరి తండ్రి ద్వారా సంక్రమించింది వారే తీసుకుందామని చెబుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల నుంచి కుటుంబ సభ్యులు అనేకమార్లు గొడవలు పడ్డారు. ఇటీవల క్రోసూరులో జరిగిన ప్రజా దర్బార్‌లో కూడా ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఆదివారం రాత్రి రెండో భర్త కుమారుడు, రెండో భర్త తరుపు వారు కొంతమంది మొదటి భర్త కుమారుడు బాషాపై దాడికి దిగారు. బాషా తరుపున అతని మామ చిన బాజీ, మరి కొందరు ఘర్షణలో పాల్గొన్నారు. మహమ్మద్ బాషాకు, చిన బాజీకి బలమైన గాయాలు అవ్వటంతో వారిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహమ్మద్ బాషా సోమవారం ఉదయం మరణించాడు. అతని మామ చిన బాజీ పరిస్థితి కూడా ఆందోళనకంగా ఉంది. షేక్ బాసిత్, మీరాబీకి గాయాలయ్యాయి. పెదకూరపాడు సీఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా భూముల్లో మొక్కలు నాటుతున్నారు

- రైతుల ఆందోళన, మొక్కలు నరికివేత



ఫ్యాక్టరీ ఆవరణలో ధర్నా చేస్తున్న సొసైటీ భూముల రైతులు

దాచేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం గామాలపాడు సమీపంలోని ఆంధ్రా సిమెంట్స్ హద్దును ఆనుకొని ఉన్న భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం మొక్కలు నాటింది. గామాలపాడు, ఇరికేపల్లి గ్రామాల సొసైటీ భూములకు చెందిన రైతులు సోమవారం ఆయా మొక్కలను నరికి వేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా తమ పూర్వీకుల నుంచి హక్కుగా సంక్రమించిన భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రోడ్లు, మొక్కలు వేయటం చేస్తుందని ఆరోపించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సొసైటీ భూములకు సంబంధించి సుమారు 75 ఎకరాల భూమిని ఆక్రమించిందని, ఈ విషయంపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. విషయం కోర్టులో ఉండగా ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం ఆ భూముల్లో రోడ్లు వేయటం, మొక్కలు నాటడం చేస్తుందన్నారు. తమకు న్యాయం జరిగే వరకు సొసైటీ భూముల్లోకి ఎవరూ రావడానికి వీలులేదని రైతులు స్పష్టం చేశారు. వివాదంలో ఉన్న భూముల్లో కూర్చొని ధర్నా చేశారు.

ఆ భూములు మావే : ఫ్యాక్టరీ యాజమాన్యం

ఆంధ్రా సిమెంట్స్ ఫ్యాక్టరీకి చెందిన భూముల్లోనే మేము రోడ్లు వేయడం, మొక్కలు నాటడం చేశామని ఆంధ్రా సిమెంట్స్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ విషయంపై అనుమతులు లేని వ్యక్తులు ఫ్యాక్టరీ హద్దుల్లోకి ప్రవేశించి 180 మొక్కలను నరికేశారని ఆరోపించారు. దీనిపై దాచేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

గొడవలకు దిగితే పీడీ యాక్ట్ నమోదు


పోలీసులతో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

రాజుపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రతిఒక్కరూ సయోధ్య, సఖ్యతతో మెలగాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు తెలిపారు. సోమవారం తెల్లవారుజాము నుంచి రాజుపాలెం మండలం నెమలిపురిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానించే ప్రాంతాలు, పాడుబడిన పశువుల పాకలు, పలు నివాస గృహాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో హత్య జరిగిందనీ, మళ్లీ ఏమైనా అలజడులు సృష్టించినా, గొడవలకు పురిగొల్పినా సహించేది లేదని, అవసరమైతే గ్రామ బహిష్కరణకు కూడా వెనుకాడబోమన్నారు. గొడవలకు దిగితే ఆస్తి, కుటుంబ వ్యవస్థ పాడైపోతుందన్నారు. నెమలిపురిలో రౌడీషీటర్లు కూడా ఉన్నారని, మరెవరైనా గొడవలకు దిగితే వారిపై కూడా రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఒక్కసారి గొడవలకు పాల్పడితే ప్రతి పండగకు, ఎన్నికలు జరిగినా బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి గొడవలకు పాల్పడినా, పేకాట ఆడినా తగు కేసులు నమోదు చేస్తామన్నారు. ధ్రువీకరణ పత్రాలు సరిగాలేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో సీఐలు సుబ్బారావు, బ్రహ్మయ్య వెంకటప్రసాద్, శ్రీనివాసరావు, ఎస్ఐ వేణుగోపాల్, సబ్‌డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

జోన్‌లో మొదటి స్థానంలో నిలిచాం

- గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలామ్



గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జోన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలోని ఆర్టీసీ డిపోల్లోనే రూ.72 లక్షల ఆదాయంతో లాభాల్లో మొదటి స్థానంలో గుంటూరు-2 డిపో నిలిచిందని డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో పరిధిలో మొత్తం 112 సర్వీసులుండగా 7 ఏసీ సర్వీసులు, 15 సూపర్ లగ్జరీ, 22 అల్ట్రాడీలక్స్, 9 ఎక్స్‌ప్రెస్‌లు, ఇతర పల్లెవెలుగు సర్వీసులున్నాయన్నారు. డిపో పరిధిలో లాభాలు తీసుకురావటంలో తీసుకున్న చర్యలతోపాటు సమస్యలపై ఆయన సోమవారం మాట్లాడారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్.



డిపోను లాభాల్లోకి ఎలా తేగలిగారు?

డీఎమ్: డిపో పరిధిలో ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా బస్సులను పెంచాం. గతంలో హైదరాబాద్‌కు 10 సర్వీసులుండగా 15కు పెంచాం. వైజాగ్ 2 సర్వీసుల నుంచి 4కు పెంచాం. గుంటూరు నుంచి బెంగళూరుకు ఇంద్ర (ఏసీ) సర్వీసుతో రోజుకు రూ.లక్ష ఆదాయం సమకూరుతుంది. అంతేగాక గుంటూరు-విజయవాడ నాన్ స్టాప్ సర్వీసులు గతంలో 15 ఉంటే 25కు పెంచాం. అరుణాచలం గిరి ప్రదక్షణకు ఈ ఏడాదిలో రాష్ట్రంలోనే టాప్‌లో 28 సర్వీసులు నడపటం వంటి చర్యలతో లాభాల్లోకి తెచ్చాం.

గ్రామాల్లో ఆర్టీసీ సర్వీసులు పరిస్థితి ఏమిటి?

డీఎమ్: డిపో పరిధిలో ఇప్పటికే 47 గ్రామాలకు పల్లెవెలుగు సర్వీసులను అందుబాటులోకి తెచ్చాం. డిపో పరిధిలో నిత్యం 26వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేస్తాం.

డిపో పరిధిలో ఈపీకే ఎలా ఉంది?

డీఎమ్: డిపో పరిధిలో ఎర్నింగ్ పర్ కిలోమీటర్ (ఈపీకే) రూ.45.37లుగా ఉంది. ఇది రాష్ట్రంలోనే 11వ స్థానంలో డిపో ఆదాయంలో ఉండటం డిపో, గ్యారేజ్ సిబ్బందితో పాటు సమష్టి కృషితో సాధ్యమైంది.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఫిర్యాదులపై చర్యలు ఏమిటి?

డీఎమ్: సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసినా, మద్యం తాగి విధులకు వచ్చినా విధుల నుంచి తప్పించటమే మరో ప్రశ్నే లేదు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నాం. దీనిపై ఉన్నతాధికారులు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్ అవార్డు గర్వకారణం


డాక్టర్ శ్రీకృష్ణని అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ

గుంటూరు (విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) నుంచి బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్ 2023 -స్టేట్ అవార్డు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల అధ్యాపకురాలు ప్రొఫెసర్ డా. ఏ. శ్రీ కృష్ణకు లభించడం గర్వకారణమని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యా బోధనా వివిధ పరిశోధనలకు, 30 సంవత్సరాల నుంచి అధ్యాపక వృత్తిలో విధులు నిర్వహిస్తూ కళాశాల ఐటీ విభాగ ప్రొఫెసర్ అండ్ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ ఏ. శ్రీకృష్ణను ఐ.ఎస్.టి.ఈ ఆంధ్రప్రదేశ్ సెక్షన్ 'బెస్ట్ ఉమెన్ ఇంజనీరింగ్ టీచర్ అవార్డుకు ఎంపిక చేసి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను ఐ.ఎస్.టి.ఈ. ఛైర్మన్ ప్రొఫెసర్ జి.రంగ జనార్దన్, హానర్ సెక్రటరీ ప్రొఫెసర్ బి.ఈశ్వర రెడ్డి చేతుల మీదుగా ఆమెకు అందజేశారు.

సాగర్ ప్రాజెక్ట్ 2 క్రస్ట్‌గేట్లద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు సోమవారం 2 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. 2 గేట్లను 6 అడుగులు మేర ఎత్తి 19,880 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా నాగార్జున సాగర్ నీటి మట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,160 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,679 క్యూసెక్కులు, 2 క్రస్ట్‌గేట్ల ద్వారా 19,880 , ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 69,310 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో వాటర్‌గా 69,310 క్యూసెక్కుల వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 45,850 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 44,222 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

54,065 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 63,735 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 54,065 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,584 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	16000	334	9000	16000
నెంబరు. 5	9000	13500	నెంబరు. 5	10800	11500
273	11500	12000	273	10000	13500
341	9000	15000	341	9000	13500
4884	10500	14500	4884	9000	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18400	తేజ	8000	18300
బ్యాడిగి	9000	16000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	10000	14500	దేవనూరు డీలక్స్	10000	15000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	6000	11500

జిల్లాకు చేరిన వ్యాధి నిరోధక టీకాలు

గుంటూరు మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా గన్నవరంలోని రాష్ట్ర వ్యాక్సిన్ స్టోర్స్ నుంచి అక్టోబరు 25వ తేదీ శుక్రవారం అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు జిల్లా వ్యాక్సిన్ స్టోర్స్‌కు సరఫరా అయినట్లు ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్‌వో, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వ్యాధి నిరోధక టీకాలను వెంటనే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసినట్లు ఆయన వివరించారు. పసి పిల్లలకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు బుధ, శనివారాల్లో జరిగే ఇమ్యు నైజేషన్ కార్యక్రమంలో ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎస్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణనగర్ 5వ లైన్ నుంచి 6వ లైన్ వరకు, కుందుల రోడ్డు ఏరియాలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, నవభారత్‌నగర్, సిద్ధానగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే, తుఫాన్‌నగర్, మారుతీనగర్, నాయిబ్రాహ్మణ కాలనీ, తురకపాలెం రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీ4 సెక్షన్‌ఏఈ కె అంజనీరావు మరో ప్రకటనలో తెలిపారు.

డీఆర్‌వోగా కాజావలి

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా షేక్ కాజావలి నియమితుడయ్యారు. నరసాపురంలో విధులు నిర్వహిస్తూ ఆయన గత కొన్ని నెలల నుంచి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ మేరకు చీఫ్ సెక్రెటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ నెల 24వ తేదీన జారీ చేసిన జీవోలో గుంటూరు డీఆర్‌వోగా కడప జిల్లా జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పీఏ టూ స్పెషల్ కలెక్టర్ జీ.శ్రీనివాసులుని ప్రభుత్వం నియమించింది. ఆ పోస్టింగ్ ఆర్డర్‌ని ఉప సంహరించుకుంటూ తాజాగా కాజావలిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించింది.



నూతన డీఈఓను అభినందిస్తున్న ఎంఈఓ కుద్దూస్, ఉర్దూ డీఐ కాశీం, హెచ్ఎం అసోసియేషన్ నాయకులు తిరుమలేష్ తదితరులు

డీఈఓగా రేణుక బాధ్యతలు


గుంటూరు(విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా సీవీ రేణుక సోమవారం బాధ్యతలు స్వీ కరించారు. గుంటూరు ఎంఈఓ కుద్దూస్, ఉర్దూ డీఐ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠ శాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌కేఎండీ కాశీం, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు తిరుమలేష్ తదితరులు డీఇఓకు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన రేణుకకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. విభాగాల వారీగా తమను తాము పరిచయం చేసు కున్నారు. కాగా, ఇటీవల పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా డివోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతన డీఈఓ రేణుక బాధ్యతల స్వీకరించారు. సీవీ రేణుక 2008లో డిప్యూటీ డిఈఓ వైజాగ్‌లో తొలి పోస్టింగ్ ప్రభుత్వ ఇచ్చింది. అనంతరం డీఈఓగా పదోన్నతి పొందారు. పదోన్నతిపై కృష్ణా జిల్లా ఎన్టీఆర్ జిల్లాలో డీఈఓగా పని చేశారు. తాజాగా పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన బదిలీల్లో రేణుకను గుంటూరు జిల్లా డీఈఓగా నియ మిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

రైల్వేలో విజిలెన్స్ అవగాహన వారోత్సవం

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అవగాహన వారోత్సవం-2024 గుంటూరు రైల్వే డివిజన్‌లో ఘనంగా ప్రారంభమైంది. సోమవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ రైల్వే అధికారులు, సిబ్బందితో సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కే.సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు నిజాయితీగా పనిచేయాలి

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీ హెచ్ ఎస్) చీఫ్ మెడికల్ ఆఫీసర్ టిహెచ్ కోటేశ్వరరావు అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను కలెక్టరేట్ రోడ్డులోని సీజీహెచ్ ఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రారంభించారు.లంచగొండితనాన్ని నిర్మూలిస్తా మని సిబ్బందితో ప్రమాణం చేయించారు.



డాక్టర్ వై. కిరణ్ కుమార్‌కు చెక్కును అందజేస్తున్న ప్రజా ఆలోచన వేదిక సభ్యులు

నాట్కో కేన్సర్ సెంటర్‌కు రూ.50 వేల విరాళం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీ జీ హెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు ప్రజా ఆలోచన వేదిక సభ్యులు రూ 50 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్ కుమార్, నాట్కో విభాగాధిపతి డాక్టర్ జి.దుర్గాప్రసాద్‌కు సోమవారం ప్రజా ఆలోచన వేదిక, స్వచ్ఛంద సేవకులు వల్లూరి సదాశివ రావు అందజేశారు. మేడూరి రాజేంద్రప్రసాదు, డాక్టర్ ఏ జాహ్నవి, డాక్టర్ వెంకారెడ్డి, డాక్టర్ జె మురళీకృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ, పంచాయతీరాజ్, జీఎంసీలలో

పెండింగ్ అర్జీలు అధికం

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- ఇకపై ప్రతి సోమవారం గత వారంలో అర్జీలపై శాఖల వారీగా సమీక్ష
- పీజీఆర్ఎస్‌కు 211 అర్జీలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అర్జీలపై శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించారు. కార్యక్రమానికి 211 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో కె.శ్రీనివాస రావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీరాజ్, జీఎంసీకు సంబంధించిన అర్జీలు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఇకపై ప్రతి సోమవారం గతవారం అందజేసిన అర్జీలపై సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జేసీ మాట్లాడుతూ అర్జీలతో పాటు లోకాయుక్తా, ఎన్‌హెచ్ ఆర్‌సీ, నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ కాస్ట్‌లో కేసులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, డీఎస్‌వో కోమలి పద్మ, పంచాయతీరాజ్ ఎస్ఈ గుర్రం బ్రహ్మయ్య, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం పాల్గొన్నారు.

● గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు ప్రారంభించాలి

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించడానికి అవసమైన నిధులను కేటాయించి పనులను తక్షణమే ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘ నాయకులు డాక్టర్ కొల్లరాజమోహన్ అర్జీ అందజేశారు. 50వేల ఎకరాలకు సాగు నీరు, అనేక గ్రామాలకు తాగు నీరు అందించే ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించాలని కోరారు. అంతేగాక ఛానల్ పొడిగింపు కోసం చేపట్టిన ధర్నాలు, ఆందోళనలు సందర్భంగా రైతులు, మహిళలపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.హరి ప్రసాద్, అంకమ్మ చౌదరి, డి.హరి బాబు, ఎం.వెంకయ్య ఉన్నారు.

● బ్యాంకు రుణాలివ్వట్లేదు.. నివాస ప్రాంతంగా మార్చండి

ఇండస్ట్రియల్ జోన్‌ను తీసివేసి ప్రజా నివాస ప్రాంతంగా మార్చాలని గుంటూరు రూరల్ పరిధిలోని అంకిరెడ్డిపాలెం శివారు శ్రీలక్ష్మీ సీతా రామయ్యకాలనీ వాసులు అర్జీ అందజేశారు. ఈ కాలనీలో 1987లో దాదాపు 300 కుటుంబాలు స్థలాలను కొనుగోలు చేశామని, కానీ 2006లో నగరపాలక సంస్థ అధికారులు తమకు తెలియ కుండా ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చారని, ఈ కారణంతో బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదని, ఇంటి నిర్మాణాలు చేయలేకపోతున్నామని అవేదన వ్యక్తం చేశారు. 2019-24 మధ్యకాలంలో రెసిడెన్షియల్ జోన్‌గా మారుస్తామని కార్పొరేషన్ అధికారులు చెప్పారని, కానీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. ఉన్నతాధి కారులు స్పందించి నివాస ప్రాంతంగా మార్చాలని కోరారు. అర్జీ అందజేసిన వారిలో కాలనీ వాసులు పిచ్చయ్య, రామ్మోహనరావు, నాగేశ్వర రావు, సాంబశివ రావు, రంగారావు, శ్రీనివాసరావు ఉన్నారు.

● చంద్రరాజేశ్వరరావు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

స్థానిక ఆర్‌వీఆర్ కళాశాల సమీపంలోని చంద్ర రాజేశ్వరరావు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానిక టీడీపీ నాయకుడు బత్తుల ఏడుకొండలు అర్జీ అందజేశారు. కాలనీలో 6 వేల నివాసాలు ఏర్పాటు చేసుకుని దాదాపు 20 వేల మంది ఉన్నారని, కనీసవసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలి పారు. రోడ్లతో పాటు ప్రాథమిక పాఠశాలు, రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని కోరారు. నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో వేముల శ్రీనివాస్, బిర్లారాజు, చేతనరాజు పల్లి వీర్రాజు తదితరులు ఉన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ

కలెక్టరేట్‌లో ఫిర్యాదుల కోసం క్యూఆర్ స్కాన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు ఇవ్వడానికి కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరం వద్ద అధికారులు క్యూఆర్ స్కాన్‌ను ఏర్పాటు చేశారు. అర్జీదారులు నేరుగా లేదా క్యూఆర్ స్కాన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

'డయల్ యువర్ కమిషనర్'కు విశేష స్పందన

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనర్'కు విశేష స్పందన లభించినట్లు జీఎంసీ కమిష నర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ చాంబర్‌లో 'డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో ప్రజా మస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో కమిషనర్ మాట్లాడారు. సోమవారం నిర్వ హించిన పీజీఆర్ఎస్ కు 64 ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఆయా ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిష నర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ అధికారులపై కమిషనర్ ఆగ్రహం



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్

నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే నగరంలో 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేస్తున్నా కొందరు నిర్లక్ష్యంగా ఉంటున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత పండరీపురం 2,3 లైన్లు పరిశీలించి, రోడ్ల మీద గార్బేజ్ కుప్పలు ఉండడం, డ్రైన్లలో మురుగుపారుదల లేకుండా ఉండడం గమనించి, పారిశుధ్య పనులపై స్థానికుల ఫిర్యాదులను తీసుకొని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న స్థానిక శానిటేషన్ కార్యదర్శి ఎం.రాజకుమారిని విధుల నుండి సస్పెండ్ చేయాలని సిఎంఓహెచ్ ని ఆదేశించారు. కార్యదర్శులు మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలని, ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేస్తే రోడ్ల మీద వ్యర్థాలు ఉండవన్నారు. కమర్షియల్ సంస్థలు రోడ్ల మీద వ్యర్థాలు వేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలన్నారు. అశోక్ నగర్ మెయిన్ రోడ్డుని పరిశీలించి, వీధి దీపాల సమస్యపై ఫిర్యాదులు అందుతున్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, భవన నిర్మాణ సామాగ్రి రోడ్లపై, డ్రెయిన్లలో వేయకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనం తరం శంకర్ విలాస్ ఆర్‌ఓబి మార్కింగ్‌ని అరండల్ పేట మెయిన్ రోడ్ లో పరి శీలించి, మార్కింగ్ వేగవంతం చేసి నివేదిక ఇవ్వాలని, అందుకు తగిన విధంగా సిబ్బందిని కేటాయించుకోవాలని ఏసీపీని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందర రామిరెడ్డి, డిఈఈ కళ్యాణ రావు, ఏసిపి రెహ్మాన్, ఎంహెచ్ఓ ఆనందకుమార్, స్పెషల్ శానిటేషన్ ప్రత్యేక అధికారి నిరంజన్, ఎస్.ఎస్. సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ.బాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఎంసీ ఆశీలను సిబ్బందికి మాత్రమే చెల్లించండి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని జీఎంసీకి సంబంధించిన మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు, మరుగుదొడ్లు, సండ్రీస్ మార్కెట్లలో ఆశీలను నగరపాలక సిబ్బందికి మాత్రమే చెల్లించి రశీదు పొందాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. దళారులు వసూళ్లకు వస్తే నేరుగా నగర కమిషనర్‌కి 9440268888 నంబరులో ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన వివిధ మార్కెట్లు, సైకిల్ స్టాండ్‌లు, మరుగుదొడ్ల వద్ద నుండి ఆశీలు వసూళ్లకు గతంలో పాటదార్ల గడువు ముగిసినందున జీఎంసీ సిబ్బందే వసూళ్లు చేస్తున్నారన్నారు. నగరపాలక సంస్థ ఐడి కార్డ్ తో, జీఎంసీ అధీకృత రశీదు అందించే వారికే ఆశీలు ఇవ్వాలని వ్యాపారులకు తెలిపారు.

మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేత

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగరపాలక సంస్థ తరపున అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్‌సోర్సింగ్ కార్మికులు సిహెచ్.లోకరాజు, జె.దేవరాజు, ఏ.ముత్తు కుమార్‌ల కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం వారికి అందజేశారు.మృతుల కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందించామని తెలిపారు.

స్వచ్ఛత అందరి బాధ్యత: స్టెప్ మేనేజర్ రాధిక



'స్వచ్ఛత'లో పాల్గొన్న స్టెప్ మేనేజర్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛత మనందరి బాధ్యత అని జిల్లా స్టెప్ మేనేజర్ బీ రాధిక అన్నారు. భారత ప్రభుత్వం, కేంద్ర యువ జన వ్యవహారాలు, క్రీడా మం త్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్ర (మై భారత్), స్టెప్ సం యుక్త ఆధ్వర్యంలో 'దిస్ దివాళి విత్ మై భారత్' కార్య క్రమాన్ని సోమవారం స్థానిక గాంధీ పార్కు పరిసరాల్లో చేప ట్టారు. ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి 3 రోజుల పాటు జరిగే కార్య క్రమంలో యువత భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి, దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారి



డ్రోన్‌తో వ్యవసాయ విద్యార్థినులు, గ్రామస్థులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం జొన్నలగడ్డలో ఆధునిక సాంకేతిక యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ సాయంతో పంటపై పురుగు, తెగులు, సూక్ష్మ పోషకాలు మందులు పిచి కారి చేసే కార్యక్రమం సోమవారం జరిగింది. ఉత్తమ రైతు అవార్డు గ్రహీత వంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఈ విధానంతో రైతులకు కూలీ ఖర్చు తగ్గుందని, అంతేగాక ఎక్కువ నీరు అవసరం లేదన్నారు. డ్రోన్‌తో ఒక ఎకరానికి 11 లీటర్ల నీరు సరిపోతుందని, రోజుకు సరాసరి 18-22 ఎకరాలు పిచికారి చేయవచ్చని వివరించారు.

టీడీపీలో కార్యకర్తలకు అన్నివిధాలా గుర్తింపు: ఎమ్మెల్యే నసీర్



పార్టీ సభ్యత్వాలను నమోదు చేస్తున్న ఎమ్మెల్యే

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీల్లో లేని విధంగా టీడీపీలో క్రియాశీలక కార్యకర్తలకు తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగో డివిజన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం కావాలని, రాష్ట్రంలోనే సభ్యత్వ నమోదులో గుంటూరు తూర్పు నియో జకవర్గం మొదటి స్థానంలో నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ కార్యకర్త, నాయకుడూ టీడీపీ సభ్యత్వంపై ప్రజలకు అవగాహన కలిగించి, వారిని టీడీపీ కుటుంబంలో భాగస్వామ్యం చేయా లని పిలుపు నిచ్చారు. గతంలో వంద రూపాయలు కట్టి సభ్య త్వం తీసుకున్నవారికి రూ.2 లక్షల బీమా ఉండగా, ఈ సంవత్సరం నుంచి అదే వంద రూపాయలు కట్టి సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా అందిస్తోందని చెప్పారు. కార్పొరేటర్ అశోక్, వార్డ్ అధ్యక్షుడు రబ్బాని, హసేన్, జే. శ్రీనివాస్, రహమత్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణులకు పాలకమండలి సభ్యులుగా అవకాశంపై హర్షం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులకు దేవాలయాల్లోకి పాలకమండలి సభ్యులుగా అవకాశమివ్వడం అభినందనీయమని నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి వెంకట్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్‌ను జేఏసీ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కందుకూరి వెంకట్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు అరుదైన అవకాశం వచ్చిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రానున్న నామినేటడ్ పదవుల్లో నాయీ బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయన విజ్ఞప్తి చేశారు.

'ట్రూ అప్' భారం జగన్ ప్రభుత్వ పాపమే: మన్నవ మోహనకృష్ణ



మాట్లాడుతున్న మన్నవ

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీల భారం వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన పాపమేనని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. గుంటూరులోని టీడీపీ కార్యా లయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ అధికారం నుంచి దిగిపోయినా ఆయన చేసిన పాపాలు రాష్ట్ర ప్రజలను పట్టిపీడిస్తున్నాయన్నారు. 2022- 23లో అధిక ధరకు బహిరంగ మార్కెట్లో ఎడాపెడా విద్యుత్ కొనుగోలు చేయడంతో రూ. 6,072.86 కోట్ల అదనపు ఛార్జీల భారాన్ని ప్రజలు మోయక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీల కింద ఆ మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేసుకునేందుకు డిస్కంలకు అను మతిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) గత శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చిందని అన్నారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదించిన వీటీపీఎస్, కృష్ణపట్నం మూడో యూనిట్ థర్మల్ విద్యుత్ కేంద్రాలను నాటి జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో డిస్కంలు బహిరంగ మార్కెట్లో అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వచ్చిందని అన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై మాట్లాడే కనీస అర్హత జగన్‌కు ఉందా? 2022-23, 23-24 ఇంధన సర్దు బాటు ఛార్జీలను ప్రజలపై మోపాలని డిస్కంలకు అనుమతిచ్చింది జగన్ కాదా? అని ప్రశ్నించారు. మార్కెట్‌లో యూనిట్ రూ.3-4కి దొరుకుతుంటే, యూనిట్ రూ.12 పెట్టి మరీ తమ బినామీల నుంచి విద్యుత్ కొని ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు.

ఆలయ నిర్మాణానికి చేయూతనిస్తా: డేగల ప్రభాకర్



డేగల ప్రభాకర్ ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత గుంటూరు మల్లయ్య లింగంనగర్‌లోని శ్రీవల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్మాణాలకు చేయూత నందిస్తామని గుంటూరు నగర టీడీపీ అధ్యక్షుడు డేగల ప్రభాకర్ తెలిపారు. సోమ వారం ఆలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణపు పనులను పరిశీలించిన ఆయన, త్వరగా పూర్తి చేయాలని కోరారు.

సమ్మె కాలపు జీతం, పండగ కానుక చెల్లించండి



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గత సమ్మె కాలం ఒప్పందాల జీఓలు వెంటనే ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్,వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాపిత మున్సిపల్ కార్మికుల సమ్మె ముగిసి 9 నెలలు అయిందని, సమ్మె కాలం జీతం, పండగ కానుక రూ.1000 చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు చెల్లించకపోవడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు చెల్లిస్తే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎందుకు చెల్లించదని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ కార్మి కులకు జీతాలు పెంచేందుకు 9 మంది అధికారుల కమిటీ ఇచ్చిన రిపోర్టు గురించి ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి పూనుకోకపోతే కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్' పేరిట కార్మికులు పని చేసేందుకు అవసరమైన చీపుర్లు, కాలవ పారలు ఇవ్వకుండా ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ కార్మికులు పని చేసేందుకు కావాల్సిన టూల్ కిట్స్ రక్షణ పరికరాలు, సెక్యూరిటీగార్డులకు యూనిఫారం ఇవ్వడం లేదని ఆయా సమస్యలపై అనేకసార్లు విన్నవించినా పరిష్కారం కానందునే ధర్నా నిర్వహించామని అన్నారు. ధర్నాలో యూనియన్ నగర అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, శానిటేషన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

పోలీస్ రక్త దాన శిబిరానికి అనూహ్య స్పందన

గుంటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అమరవీరుల స్మారకోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ కళ్యాణ మండపంలో నిర్వ హించిన ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎస్పీ సతీష్ కుమార్ ప్రారంభించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్, రమేష్ హాస్పటల్, ఒమేగా హాస్పిటల్స్,గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రులలో ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 'రక్త దానం చేయడం ప్రాణదానంతో సమానమని అన్నారు. నిస్వార్థంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన పోలీసు సిబ్బంది, అధికారులకు, యువకులకి, విద్యా ర్థులకు జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్పీ అభినందించారు. పోలీసులు విధి నిర్వ హణతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసు లం దరూ మెగా మెడికల్ క్యాంప్ ద్వారా హెల్త్ చెకప్ చేయించుకోవాలని చెప్పారు. వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్, లివర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ట్రామా- ఆర్థో ప్లాస్టిసర్జన్, ల్యాప్రోస్కోపిక్, ఎండోస్కోపిక్, గైనకాలజీ, పల్మనాలజీ, డయాబెటాల జిస్ట్, చిల్డ్రన్ స్పెషలిస్ట్, కార్డియాలజీ, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఫిజీ షియన్, డెం టల్ వంటి విభాగాలలో ప్రముఖ వైద్యనిపుణులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యసేవలందించని డాక్టర్లను, సిబ్బందిని ఎస్పీ అభి నందించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఎఆర్ డీఎస్పీ శాంతకుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

మా ప్లాట్లు ఆక్రమించి బెదిరిస్తున్నారు

● ఎస్పీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల క్రితం తాము కొనుగోలు చేసిన స్థలాలను కొందరు వ్యక్తులు కబ్జా చేసి తమను చంపుతామని బెదిరిస్తున్నారని బాధితులు ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక ఆర్.గ్రహారం పరిధిలోని శ్మశాన వాటిక వెనుక ఐదు ఎకరాల్లో పోకూరి రంగారావు 1965 - 66 లో వెంచర్ వేసి ప్లాట్లు విక్రయించారని, బాధితులు తవ్వా శ్రీనివాసరావు, మధుబాబు, కుర్ర శ్రీనివాసరావు, శ్రీనివాస గుప్తా, బండి రాము, శ్రీనివాస్ తదితరులు ఆరోపించారు. తెనాలి, బాపట్ల, పొన్నూరు, చీరాల పట్టణాల్లోని వస్త్ర వ్యాపారులు ఇక్కడ కొనుగోలు చేశారని చెప్పారు. ఆ ప్లాట్లన్నీ తమవేనని బెదిరిస్తూ వాటి చుట్టూ ఫెన్సింగ్ వేసి తాము అక్కడికి వెళితే దాడి చేసి కొడుతున్నారని బాధితులు వాపోయారు. గతంలో రౌడీషీటర్ సంజీవ్ తమను బెదిరించాడని తెలిపారు. అందులో 80 ప్లాట్లు వేశారని, వారి నుంచి అనేక మంది చేతులు మారాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నల్లచెరువులో చీటీపాటల నిర్వాహకురాలు పరారీ

స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లచెరువులో కె.అనసూయ అనే మహిళ నమ్మకంగా ఉంటూ చీటీ పాటల పేరుతో లక్షల రూపాయలు తీసుకుని ఉడాయించిందని బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నల్లచెరువు 9/2కు చెందిన అనసూయ ఎన్నో ఏళ్లుగా చీటీ పాటలు నిర్వహిస్తోందని, స్థానికుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వడ్డీలకు తీసుకునేదని తెలిపారు. సుమారు 30 మంది చీటీ పాటల డబ్బులు, వడ్డీకి తీసుకున్న డబ్బులు కూడా కోటి రూపాయలతో పరారైనట్లు ఫిర్యాదు చేశారు. పద్మ, అంజలి, గిరిజావాణిలతో పాటు సుమారు 15 మంది బాధిత మహిళలు పోలీస్ కార్యాలయానికి వెళ్లారు. రెండు నెలల క్రితం తాము తమకు చెక్కులు, ప్రామిసరీ నోట్లు అనసూయం ఇచ్చిందని, ఆ తర్వాత రాత్రి ఇంటికి తాళం వేసి పారిపోయిందని తెలిపారు.

ప్రార్థనల పేరుతో ఇబ్బంది

స్థానిక పట్టాభిపురం పోలీస్టేషన్ పరిధిలోని మారుతీనగర్ శివారు కన్నా నాగరాజు కాలనీ నాలుగో లైన్‌లో మల్లేశ్వరరావు అనే వ్యక్తి ఇళ్ల మధ్యలో ఓ మందిరాన్ని ఏర్పాటు చేసి ప్రార్థనల పేరుతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానిక మహిళలు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇళ్ల మధ్యలో మందిరం అని పెట్టి ప్రతిరోజు ప్రార్థనలతో పాటు పెద్ద శబ్దాలతో తమకు ఇబ్బంది కలిగిస్తున్నారని, దీని వల్ల పిల్లలు చదువుకోవడానికి కూడా ఆటంకం ఏర్పడుతోందని చెప్పారు. గతంలోనూ ఈ విషయమై మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని బాధితురాలు పేర్కొన్నారు.

డబ్బు జమ చేయకుండా ఉడాయించిన డ్వాక్రా సభ్యురాలు

శారద కాలనీకి చెందిన శ్రీదేవి మహిళా స్వయం సహాయక సంఘం లోని సభ్యురాలు కోట లక్ష్మీ, ఆమె భర్త కోట భాస్కరరావులు సభ్యుల నుంచి వసూలు చేసిన డబ్బులు ఖాతాలో జమ చేయకుండా పారిపోయారని భాగ్యశ్రీ, రమణ కుమారి, సరస్వతి, శ్రీదేవి, లతా తదితరులు ఫిర్యాదు చేశారు. పదిమంది సభ్యులైన గ్రూపులో 9 మంది వద్ద నుంచి వసూలు చేసిన డబ్బులను బ్యాంకులో జమ చేయలేదని, పొదుపు డబ్బులు కూడా అని చెప్పారు. లక్ష్మీ, ఆమె భర్త మొత్తం మూడు లక్షల 90 వేల రూపాయలను వారి సొంతానిక వాడుకున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు కోరారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ప్రకృతి వైద్య విధానం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యాంత్రిక జీవితంలో ప్రకృతి వైద్య విధానమే అవ సరమని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి డైరెక్టర్ డాక్టర్ కొమరాజు సత్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఆర్.అగ్రహారంలో సోమవారం ప్రకృతి వైద్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైద్యానికి విశిష్టత స్థానం ఉందని అన్నారు. విశ్రాంత జాతీయ కౌన్సిల్ సభ్యురాలు బొల్లాప్రగడ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఆరోగ్య సూత్రాలు పాటించటం యోగా లాంటి అత్యున్నత వ్యాయామాన్ని ప్రకృతి వైద్యాన్ని, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్ళేందుకు డ్వాక్రా సంఘాలు ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రచయిత పెద్ది సాంబశివరావు ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించిన ప్రకృతి వైద్యం పుస్తకాన్ని డాక్టర్ సత్యలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొమ్మరాజు కృష్ణ, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఉమా సుందరి, డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ చంద్రిక, డాక్టర్ కొత్తపల్లి దశరధరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెరుగుతాయని వైసీపీ దుష్ప్రచారం

● బీజేపీ కిసాన్ మోర్చా నేత పాండురంగ విఠల్

గుంటూరు సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచుతోందని సోషల్ మీడియాలో వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా నేత బి.పాండురంగ విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో కూటమి ప్రభుత్వంపై ప్రజలలో దురభిప్రాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు, బడుగు బల హీన వర్గాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమయంలో విద్యుత్ చార్జీలు కూడా పెరిగితే తట్టుకోలేని పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన ఏమైనా ఉంటే ప్రస్తుతానికి విరమించుకోవాలని సూచించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర తదితరులు

యువజనోత్సవాల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన అంతర కళాశాలల యువజనోత్సవాల్లో చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మస్యూటికల్ సైన్స్‌సెస్ విద్యార్థులు స్పోర్ట్స్,సాంస్కృతి విభాగాల్లో సత్తాచాటారు. ఈ విషయాన్ని చిప్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సూర్య దేవర విద్యాధర ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యార్థులు టి.భానుయశస్వి ఫొటోగ్రఫిలో ప్రథమ బహుమతిని,ఇన్స్టాలేషన్‌లో డి.సాయిరామ్ బృందం, క్లే మౌల్డింగ్‌లో బి.స్వామి ద్వితీయ బహుమతితో పాటు స్పాట్ పెయింటింగ్‌లో ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్ అభినందించారు.

మొక్కే ఆయుధం

- గృహ కాలుష్యంపై పోరాటానికి ఇండోర్ మొక్కలు
- పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
- కాలుష్య భయంతో నగరవాసుల అప్రమత్తం

ఇంటా బయటా అంతా కాలుష్యమే.. ఆరోగ్యాన్ని దెబ్బతీసే కాలుష్యంపై యుద్ధానికి పచ్చని మొక్కే ఆయుధం. రహదారులపైన, నివాస ప్రాంతాల్లో, ఇంటి ప్రాంగణంలో మనం పచ్చదనం పరిస్తే చాలు. కాలుష్యంపై అదే యుద్ధం చేస్తుంది. అరు బయట సరే.. మరి నట్టింట్లో తిష్టవేసే కాలుష్యం మాటేమిటి? అంటే దీనికి సమాధానం మొక్కే. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు, మనం ఉపయోగించే డిటర్జెంట్లు, క్లీనింగ్ లిక్విడ్స్ నుంచి వెలువడే కాలుష్యం, కంటికి కనిపించని బ్యాక్టీరియా వీటన్నింటినీ తరిమికొట్టేది కూడా మొక్కే. ఇందుకు ఎన్నో ఇండోర్ మొక్కలు ఉన్నాయి. ఇంట్లోనే వాటిని అందమైన కుండీల్లో అమర్చుకుంటే ఇంటికి అందమే కాదు.. ఇంట్లోని వారి ఆరోగ్యానికీ మంచిదే.



తెనాలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, పల్లెల్లో నానాటికీ పెరుగుతున్న కాలుష్యంతో జిల్లా వాసులు అప్రమత్తమవుతున్నారు. ప్రధాన కూడళ్లతోపాటు ఇళ్ల పరిసరాల్లోనూ కలుషిత వాయువులు విస్తరిస్తుండటంతో ప్రజలు ఇండోర్ మొక్కల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. వ్యాపార సంస్థలు తమ కార్యాలయాల్లోనూ వీటిని గణనీయంగా పెంచుతున్నాయి.

రోడ్డుపైనే కాదు కనీసం ఇంట్లోనైనా స్వచ్ఛమైన గాలి పీల్చుకుందామంటే అది కూడా లభించని పరిస్థితి. దైనందిన జీవితంలో ఉపయోగించే వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్‌లు, సోఫాలు, దుప్పట్లు ఇతర చెక్క వస్తువులు హానికర రసాయనాలను విడుదల చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోఫాల్లోని స్పాంజిల్లో.. చెక్క వస్తువులకు వాడే వార్నిష్, దుప్పట్లు ఇతర వస్త్రాల్లో పేరుకుపోయిన ధూళి కణాలు, యంత్రాల నుంచి వెలువడే వాయువులు మనిషి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ దుష్పరిణామాలను సమర్థంగా ఎదుర్కొనే సత్తా మొక్కలకు మాత్రమే ఉంది. సరైన మొక్కలను ఇంట్లో పెంచుకుంటే స్వచ్ఛమైన ప్రాణవాయువును ఉచితంగా పొందవచ్చు. తక్కువ ఖర్చుతో విలువైన ఆరోగ్యాన్ని పొందవచ్చు. రసాయనాలు, ఇతర కాలుష్య కారకాలను శోషించుకుని స్వచ్ఛమైన గాలినిచ్చే ఇండోర్ మొక్కల పెంపకం సులభమే. ఇళ్లు, కార్యాలయాల గదుల మూలల్లో, కిటికీల్లో మరుగుదొడ్ల వద్ద, ఇంటి గడప ముందు వాటిని ఉంచితే అందంతోపాటు ఆరోగ్యాన్ని ఇస్తాయి. రెండు రోజులకోసారి వాటికి కాసిన్ని నీళ్లు పోస్తే సరిపోతుంది.

నాసా సిఫారసు చేసిన 10 ఇండోర్ మొక్కలు

అమెరికాకు చెందిన నాసా శాస్త్రవేత్తలు పలు అధ్యయనాలు చేసి గృహ కాలుష్యాన్ని తగ్గించేందుకు 10 రకాల మొక్కలను ఇళ్లలో పెంచితే ప్రయోజనం ఉంటుందని తేల్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి అమెరికాలోని జార్జియా విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో ఇళ్లలో మొక్కలు పెంచడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని తేలింది. కార్యాలయాల్లో వాటిని పెంచడం వల్ల ఉద్యోగుల్లో పని సామర్థ్యం కూడా పెరుగుతుందని తేల్చింది.

అలోవెర (కలబంద)



ఈ మొక్క విరివిగా లభిస్తుంది. గాలిలో ఉండే బెంజిన్‌ను చాలా వరకు తగ్గిస్తుంది. రంగులు, ఇంటిని శుభ్రపరిచే వివిధ రకాల రసాయనాల్లో బెంజిన్ ఉంటుంది. ఇది కేన్సర్ కారకం.

స్పైడర్ ప్లాంట్



ఇది రెండు రోజుల్లో పెరుగుతుంది. గాలిలోని 90 శాతం విషపదార్థాలను తొలగిస్తుంది. అలర్జీ కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌లను శోషణం చేసుకుంటుంది. కార్బన్ మోనాక్సైడ్ రసాయనాల ద్వారా వచ్చే ఫార్మల్‌డీహైడ్‌లను పీల్చుకుంటుంది.

క్రిశాంతిమమ్ (చామంతి)



ఇది అందరికీ తెలిసిన సువాసన భరితమైన పుష్పాలను ఇచ్చే మొక్క. కానీ చాలా మందికి తెలియని ముఖ్యమైన సుగుణం దీనికి ఉంది. ఇది ప్లాస్టిక్, జిగురు, సబ్బుల్లోని బెంజిన్ రసాయనాన్ని శోషించుకుని గాలిని శుభ్రపరుస్తుంది.

పీస్ లిల్లీ



ఇది గాలిలో స్వచ్ఛతను 60 శాతం పెంచుతుంది. గాలిలో ఉండే కొన్ని బ్యాక్టీరియాలను ఆకుల ద్వారా శోషణం చేసుకుని ఆహారంగా వినియోగించుకుంటుంది. ఆల్కహాల్, అసిటోన్ తదితరాల నుంచి వచ్చే హానికర వాయువులను పీల్చుకుంటుంది.

బోస్టన్ ఫెర్న్



ఈ మొక్క నుంచి తేమ అధికంగా వెలువడుతుంది. పొడి చర్మం ఉన్నవారికి ఇది మేలు చేస్తుంది. బుట్టలో ఉంచి దీన్ని వేలాడదీస్తే ఇంటి అందం కూడా ఇనుమడిస్తుంది. రోజూ నీళ్లు పోయడంతోపాటు ఈ మొక్కకు సూర్యకాంతి కూడా తగలాలి.

యూకలిప్టస్




ఇది అన్ని రకాల రుగ్మతలపై పనిచేసే మొక్క. దీని ఆకుల నుంచి వచ్చే వాసనల వల్ల మనలో ఆరోగ్యకర ద్రవాలు పెరుగుతాయి. దీని ఆకుల పరిమళాన్ని, దీని నుంచి తయారైన ఆయిల్స్ పీల్చడం వల్ల జలుబు, ఇతర ముక్కు, గొంతు సంబంధ ఇబ్బందులు తొలగిపోతాయి.

స్నేక్ ప్లాంట్ (పాము చెట్టు)



మరుగుదొడ్లు, స్నానపు గదులు ఇతర దుర్వాసన వెదజల్లే ప్రదేశాల్లో వీటిని పెంచడం వల్ల చెడు వాసనల నుంచి విముక్తి పొందవచ్చు.

తులసి



నిరంతరాయంగా కార్బన్ డైయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటుంది. వీటితోపాటు జర్బర్ డైసీ, ఎరికపామ్ వంటి పలు రకాల ఇండోర్ మొక్కలను ఇంట్లోని గాలిని శుభ్రపరుచుకునేందుకు పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇంగ్లిష్ ఐవీ



పెంపుడు జంతువులు పెంచుకునే వారిళ్లలో దీన్ని పెంచడం మంచిది. పెంపుడు జంతువుల ద్వారా గాలిలో వ్యాపించే బ్యాక్టీరియాను తగ్గిస్తుంది. ఇంటిని మరుగుదొడ్లు తదితరాలను శుభ్రం చేసే రసాయనాలు, ఫర్నీచర్ నుంచి ఫార్మల్ డీహైడ్ వెలువడుతుంది. ఈ మొక్క వాటిని తగ్గిస్తుంది. కార్యాలయాల్లో వినియోగించే సామగ్రి నుంచి బెంజిన్ వెలువడుతుంది. అందు వల్ల బల్లలపై ఈ మొక్క ఉంచుకోవడం మంచిది. ఇది ఔషధ మొక్క. వాపులు, నరాల నొప్పులకు వీటి ఆకులను ఉపయోగిస్తారు. అలాగే మలమూత్ర వ్యర్థాల నుంచి గాలిలోకి విడుదలయ్యే కణాలను, వాసనను శోషించుకోవడం దీని ప్రత్యేకత.

హార్ట్ లీఫ్ ఫిడోడెన్‌డ్రన్



ఈ మొక్క విషపూరితం. అందువల్ల పిల్లలు, పెంపుడు జంతువులు లేని ఇళ్లలో పెంచుకోవాలి. ఇది పైకి అల్లుకుపోతుంది. గాలిలో ఉండే ఫార్మల్ డీహైడ్‌ను బాగా తగ్గిస్తుంది.

ఆఫ్రికన్ వయొలెట్స్



ఇది ప్రాణవాయువును అధికంగా విడుదల చేస్తుంది. అందువల్ల మెదడుకు ప్రాణవాయువు బాగా సరఫరా అయి మనిషి విశ్రాంతి పొందుతాడు.

చైనీస్ ఎవర్‌గ్రీన్



ఇంటిని శుభ్రం చేసేందుకు వినియోగించే వివిధ రకాల రసాయనాల్లో ఉండే విషపూరిత వాయువులను తొలగిస్తుంది. ఇది ఎంత పెరిగితే అంత ప్రయోజనాన్ని ఇస్తుంది.

రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తాం

- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వదేశీ దర్శన్, ప్రసాద్ స్కీంల ద్వారా రాష్ట్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌లు సమర్పించామని, సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామన్నారు. టూరిజం సర్క్యూట్‌ల ద్వారా సత్ఫలితాలు సాధిస్తామన్నారు. సూర్యలంక, కాకినాడ, రామాపురం, మైపాడు బీచ్‌లను అభివృద్ధి చేస్తామని, వీటిని బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా రూపాంతరం చెందేలా కృషి చేస్తామన్నారు. నవంబరు 9న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లా శ్రీశైలంలో సీ ప్లేన్ ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. 974 కిలోమీటర్ల విశాల సముద్ర తీరంలో వాటర్ యాక్టివిటీస్ ప్రవేశపెడతామన్నారు. ఇటీవలే తూర్పు గోదావరి జిల్లాలో ఒక రోజు అధ్యాత్మిక యాత్ర ప్యాకేజీని ప్రారంభించామని, దీనికి మంచి ఆదరణ లభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. విజయవాడలో వరదలకు దెబ్బతిన్న భవానీ ఐలాండ్‌ను పునరుద్ధరిస్తామని, వైజాగ్ రుషికొండపై జగన్ తన అవసరాలకు తగినట్టుగా భవనాలను నిర్మించుకొన్నారని, అవినీతికి పరాకాష్టగా అవి నిలుస్తాయన్నారు. త్వరలోనే సామాన్య ప్రజానీకానికి అవసరం అయ్యేలా దాన్ని వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ, దేవదాయ, పర్యాటక శాఖలతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు అయిందని సమన్వయముతో ముందుకెళ్లి పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. జలవనరులు శాఖ మంత్రి కూడా సబ్ కమిటీకి తోడైతే బాగుండేది అని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా రమణ యశస్వి

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సుందరాచారి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



డాక్టర్ రమణ యశస్వి



డాక్టర్ సుందరాచారి

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రమణ యశస్వి నియమితులయ్యారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతిగా జీజీహెచ్‌లోనే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి ఇక్కడే సూపరింటెండెంట్‌గా నియమించింది. ప్రస్తుత జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్‌ను ఇదే ఆసుపత్రిలో జనరల్ సర్జరీ వైద్య విభాగాధిపతిగా నియమించారు. మచిలీపట్నం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారిని గుంటూరు వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం జీఎంసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ టీటీకే రెడ్డిని మచిలీపట్నం మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పాలనపరమైన సౌలభ్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్య కళాశాల ప్రిన్సిపాళ్లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గుంటూరు జీజీహెచ్, జీఎంసీతో పాటు విజయవాడ, కర్నూలు ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్లను కూడా మార్చారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో కోట్లాది రూపాయలతో పలు వార్డుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. డాక్టర్ సుందరాచారి వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడంతో సీఎంఈ, ఇతర అకడమిక్ కార్యక్రమాలు చురుగ్గా సాగుతాయని వైద్యవర్గాలు భావిస్తున్నాయి.

అన్నప్రాసన నాడే... ఆవకాయ పెట్టమంటే ఎలా?

- కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలే అయింది
- ఇంత తక్కువ సమయంలో ఎన్నో మంచి పనులు చేశాం
- జిల్లా సమీక్ష మండలి సమావేశంలో ఇన్‌ఛార్జ్ మంత్రి దుర్గేష్
- మీటింగ్‌లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్యన స్వల్ప వాదన

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నప్రాసన నాడే ఆవకాయ పెట్టమంటే ఎలా అని రాష్ట్ర పర్యాటక, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ నొచ్చుకొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పింఛన్‌ని రూ. వెయ్యి పెంచడానికి ఐదేళ్ల సమయాన్ని తీసుకొన్నది. అలాంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 రోజుల్లోనే రూ. వెయ్యి పెంచి క్రమం తప్పకుండా ప్రతీ నెల ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నది. పింఛన్ సొమ్ము పొందుతున్న లబ్ధిదారుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం మాటల్లో చెప్పలేనిదన్నారు. అంతేకాకుండా ఈ నాలుగు నెలల వ్యవధిలో ఎన్నో చేశాం. రాబోయే ఐదేళ్లలో మరింత మేలు చేయడమే తమ లక్ష్యమని అన్నారు. సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా జిల్లా సమీక్ష మండలి సమావేశం ఇన్‌ఛార్జ్ మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పలు సమస్యలను లేవనెత్తారు. వాటిపై ఇన్‌ఛార్జ్ మంత్రి స్పందించి పైవ్యాఖ్యలు చేశారు.

సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మధ్యన కూడా సంభాషణ ఆసక్తికరంగా సాగింది. కౌలు రైతులకు రుణాల అంశం చర్చకు వచ్చినప్పుడు తాను కొన్నేళ్లుగా పోరాడుతున్నానని లక్ష్మణరావు అన్నారు. కౌలురైతుల చట్టం గత కొన్ని సంవత్సరాల క్రితమే వచ్చిందని అయితే ఇప్పటివరకు ఏ కొద్దిమందికో తప్పితే ఎక్కువమందికి ఎలాంటి మేలు జరగలేదన్నారు. పేరుకు 44 వేలకు పైగా కౌలుదారులకు కార్డులు ఇస్తున్నప్పటికీ బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని చెప్పారు. గత ప్రభుత్వం భూయజమాని సమ్మతి ఉండాలన్న నిబంధన చేర్చిందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతున్న నూతన చట్టంపై సమావేశం నిర్వహించినప్పుడు బ్యాంకర్లను ప్రిన్సిపల్ సెక్రెటరీ బతిమాలారని, ఇది ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర విభేదించారు. నూతన చట్టంలో కేవలం ఈ-క్రాప్ బుకింగ్ పైనే రుణాలు ఇవ్వాల్సిందిగా బ్యాంకర్లను ఆదేశించామన్నారు. దీని వలన భూయజమాని సమ్మతితో పని లేదని చెప్పారు. తప్పక కౌలురైతులకు మేలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలపై మీరే పోరాటం చేస్తున్నారన్న పేటెంట్ హక్కు కావాలంటే తీసుకోండి. వారి సమస్యలపై మాట్లాడేందుకు మాకు భయం అని మీరు వ్యాఖ్యలు చేయడం సరికాదు. అందరి హక్కులను కాపాడటం మా బాధ్యత అని జవాబిచ్చారు.



ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలోనే ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్య వాగ్వాదం

ఇదే రీతిన గుంటూరు ఛానల్‌పై స్వల్పకాలిక చర్చ జరిగిన సందర్భంలోనూ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే నరేంద్ర మధ్య మాటకు మాట జరిగింది. గత 50 ఏళ్లుగా డాక్టర్ కొల్లా రాజమోహన్ పోరాటం చేస్తున్నారని, భూసేకరణకు అవసరమైన రూ. 104 కోట్లు విడుదల చేసే ప్రయత్నం ఏమైనా చేస్తారా అని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యేలు నరేంద్ర, బూర్ల రామాంజనేయులు స్పందిస్తూ గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునీకీకరణ పనులను గత టీడీపీ ప్రభుత్వమే మంజూరు చేసిన విషయాన్ని గ్రహించాలన్నారు. ఇరిగేషన్ సమస్యలు ఈనాటివి కాదని, మనం పుట్టకముందు నుంచి ఉన్నాయని చెప్పారు.

ఓ రౌడీషీటర్‌కు గన్‌మెన్ సౌకర్యమా...?

- అడ్డగోలుగా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ అదనపు డీజీ పీఎస్సార్
- ఏడాది పాటు రెచ్చిపోయిన రౌడీషీటర్ బోరుగడ్డ

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో చట్టం అధికార పార్టీ నేతలకు, కొందరు ఐపీఎస్‌లకు చుట్టంగా మారింది అనడానికి ఇది మరో ఉదాహరణ. చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా ఓ రౌడీషీటర్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించిన ఘనత నాటి వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. బాస్ ఆదేశించారు నేను అమలు చేశాను అన్నట్లుగా అధికార వైసీపీ నాయకులు ఏది చెబితే అది తోక ఊపుతూ అమలు చేసిన నాటి ఇంటిలిజెన్స్ అదనపు డీజీ పి సీతారామాంజనేయులు తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నారు. ఇప్పటికే ఆయన వైసీపీ హయాంలో ఎంపీగా వున్న రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో రెండో నిందితునిగా ఉన్న విషయం విధితమే. గుంటూరులోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో పి సీతారామాంజనేయులు ఏ2గా ఉన్నారు. ఈ కేసులో ఏ1గా పీవీ సునీల్ కుమార్, ఏ3గా జగన్మోహన్‌రెడ్డి ఉన్న విషయం విధితమే. అదేవిధంగా విజయవాడలో సినీనటి జత్వానీ కేసులోనూ పిఎస్ఆర్ ఏ2 నిందితునిగా ఉన్నారు. నిబంధనలను అతిక్రమించి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ అదనపు డీజీగా ఉన్న సీతారామాంజనేయులు అడ్డగోలుగా వ్యవహరించారు. నాటి సీఎం జగన్, నాటి ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశిస్తే అది చేసేశారు. నిబంధనలను ఏమాత్రం పాటించలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డుగోలుగా తీసుకున్న నిర్ణయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించాలని నాటి ఇంటెలిజెన్స్ అదనపు డీజీ సీతారామాంజనేయులు తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం కలకలం రేపుతోంది. సాధారణంగా ఒక వ్యక్తికి గన్‌మెన్ సదుపాయం కల్పించాలన్నా లేదంటే, గన్ లైసెన్స్ ఇవ్వాలన్నా అనేక నిబంధనలు ఉన్నాయి. సంబంధిత వ్యక్తులు తమకు ప్రాణహాని ఉన్నట్లు తగిన ఆధారాలతో జిల్లా ఎస్పీకి గానీ డీజీపీకి గాని ఇంటెలిజెన్స్ డిజికి గాని దరఖాస్తు చేసుకోవచ్చు. ముఖ్యంగా మావోయిస్టుల నుంచి ముప్పు ఉంటే వారి నుంచి బహిరంగంగా వచ్చిన హెచ్చరికలకు సంబంధించిన ఆధారాలను పోలీసులు అధికారులకు సమర్పించాలి. లేదంటే ఇతర వ్యక్తుల నుంచి ఆయనకు ఏదైనా ప్రాణహాని ఉన్నట్లు వారి నుంచి బెదిరింపులు గాని లేదంటే వారు హత్యాయత్నం చేసినట్లు గాని ఎఫ్ఐఆర్‌లు ఉండాలి. దీనిపై ఇంటిలిజెన్స్ డిజి అధికారులు విచారించాల్సిందిగా జిల్లా ఎస్పీకి ఆ ఫిర్యాదును పంపుతారు. దీనిపై ఎస్పీ సంబంధిత స్పెషల్ బ్రాంచ్ వర్గాలతో ఆయనకు ప్రాణహాని ఉందా లేదా అనే విషయంలో ఆరా తీస్తారు. మరోవైపు ఇంటెలిజెన్స్ అధికారులు కూడా తమ సిబ్బందితో రహస్యంగా దర్యాప్తు చేయించి నివేదిక తెప్పించుకుంటారు. ఆయనకు ప్రాణహాని ఉందని విచారణలో తేలితే ఉన్నతాధికారులకు పంపి గన్‌మెన్ సదుపాయం కల్పిస్తారు. అయితే ఎవరినుంచైనా బెదిరింపులు వచ్చినా, ప్రాణహాని తలపెట్టే అవకాశం ఉందని అనుమానించిన సంబంధిత వ్యక్తి అభ్యర్థన మేరకు గన్‌మెన్ సౌకర్యం కల్పించాల్సి ఉందని పోలీసు శాఖ భావించిన పక్షంలో అందుకు అయ్యే ఖర్చు ఆయన నుంచే వసూలు చేస్తారు. ఒకరిని గన్‌మెన్‌గా కేటాయిస్తే షిఫ్ట్ వారీగా ఇరువురు గన్‌మెన్‌లు ఆయన వద్ద నిధులు నిర్వహించాల్సి ఉంటుంది ఒక్కో గన్‌మెన్‌కు రోజుకు రెండు వేలు చొప్పున ఇరువురికి నెలకు కనీసం లక్షా 20 వేల నుంచి లక్షన్నర వరకు సదరు వ్యక్తి చెల్లించాల్సి ఉంటుంది. ఇదే తరహాలో నాటి అదనపు అడ్వకేట్ జనరల్‌గా విధులు నిర్వహించిన పొన్నవోలు సుధాకర్ రెడ్డి కూడా గన్‌మెన్ సదుపాయం పొందారు. దీనిపై జిల్లా ఎస్పీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ గన్‌మెన్ సదుపాయం తొలగించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో పొన్నవోలు హైకోర్టుకు వెళ్లగా గన్‌మెన్ సదుపాయం తొలగించాలని హైకోర్టు ఆదేశించడంతో పొన్నవోలుకు గన్‌మెన్‌ను పోలీస్ శాఖ ఉప సంహరించుకుంది.

రౌడీ షీటర్ బోరుగడ్డకు నేరుగా..

రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ విషయంలో నాటి ఇంటిలిజెన్స్ అదనపు డీజీ పీఎస్సార్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. కనీసం ఎటువంటి విచారణ కానీ, ఆయనకు ప్రాణహాని ఉన్నట్లు గానీ ఎటువంటి ఆధారాలు లేకుండానే ఇంటిలిజెన్స్ అదనపు డీజీ హోదాలో జిల్లా ఎస్పీకి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో గత ఎన్నికలకు ముందు సుమారు ఏడాది నుంచి ఆయనకు గన్‌మెన్ సదుపాయం కల్పించారు. దీంతో బోరుగడ్డ ప్రభుత్వం కల్పించిన గన్‌మెన్ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు గన్‌మెన్లు ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా గన్‌మెన్లు స్వచ్ఛందంగా ఎవరికి వారు వైదొలిగారు. ప్రస్తుతం అరండల్‌పేట పోలీసులు ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి మూడు రోజుల కస్టడీకి తీసుకువచ్చారు. బోరుగడ్డను విచారిస్తున్న సమయంలో ఆయన గన్‌మెన్ సదుపాయంపై చెప్పిన సమాధానం సర్వత్రా విస్మయాన్ని కలిగించింది. తాను సీఎంకు సలహాదారుడిని కాబట్టే తనకు గన్‌మెన్ సదుపాయం కల్పించారని బోరుగడ్డ చెప్పుకోవడం విశేషం. ఈ నేపథ్యంలోనే సజ్జల ఆదేశాలతో నాటి ఇంటిలిజెన్స్ అడిషినల్ డిజి సీతారామాంజనేయులు తనకు సదుపాయం కల్పించారని ఆయన చెప్పడం పోలీస్ వర్గాలతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

శీతల గిడ్డంగుల లైసెన్సుల రెన్యువల్‌కు డీఆర్‌సీ ఆమోదం

- సంబంధిత యాజమాన్యాల వద్ద అఫిడవిట్ తీసుకోవాలి

గుంటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శీతల గిడ్డంగుల లైసెన్సులన్నింటిని రెన్యువల్ చేయడానికి డీఆర్‌సీ ఆమోదం తెలిపింది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కోల్డ్‌స్టోరేజ్‌ల లైసెన్సుల రెన్యువల్ పెండింగ్ అంశం చర్చకు వచ్చింది. దీనిపై తొలుత ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్‌లు దశాబ్దాల క్రితమే నిర్మించారు. ఇప్పుడు వాటిల్లోకి అగ్నిమాపక శాఖ శకటం వెళ్లి చుట్టూత తిరిగే పరిస్థితి లేదు. ఈ కారణాన్ని చూపుతూ ఆ శాఖ ఎన్‌వోసీ ఇవ్వడం లేదని, దీని వలన లైసెన్సుల రెన్యువల్ జరగడం లేదన్నారు. లైసెన్సుల రెన్యువల్ జరగకపోతే రేపటి రోజున ఏదైనా ప్రమాదం జరిగితే బీమా కంపెనీలు క్లెయిమ్‌లు చెల్లించే పరిస్థితి ఉండదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పందించి కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉంచిన రైతుల సరుకుకు యాజమాన్యాలదే పూర్తి బాధ్యత చేసి వాళ్ల వద్ద అఫిడవిట్ తీసుకొని లైసెన్సుల రెన్యువల్‌కు చర్యలు తీసుకొంటా మన్నారు. ఇందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సానుకూలంగా స్పందించారు. డీఆర్‌సీ ఆమోదం దృష్ట్యా కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాల వద్ద అఫిడవిట్‌లు తీసుకొని లైసెన్సుల రెన్యువల్ ప్రక్రియని ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబుని ఆదేశించారు.

ఉచిత గ్యాస్ బుకింగ్‌కు మార్చి 31 వరకు గడువు

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం దీపం-2లో తొలి రీఫిల్ సిలిండర్ బుకింగ్ చేసుకోవడానికి 2025 మార్చి 31వ తేదీ వరకు సమయం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ మంగళవారం నుంచి బుకింగ్స్ ప్రారంభమౌతాయని, దీని దృష్ట్యా అందరూ ఒకేసారి బుకింగ్స్ చేసుకొంటే సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అవసరం ఉన్న వాళ్లే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. మార్చి 31వ తేదీ లోపు ఎప్పుడు బుకింగ్ చేసుకొన్నా ఉచిత గ్యాస్ సిలిండర్ డెలివరీ జరిగిన 48 గంటల్లో నగదుని బ్యాంకు అకౌంట్‌కి జమ చేస్తామన్నారు.

హ్యాండ్‌బాల్ విజేత గుంటూరు జిల్లా



హ్యాండ్‌బాల్‌లో విజయం సాధించిన గుంటూరు జిల్లా బాల బాలికల జట్టు

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్లు విజయం సాధించాయి. తెనాలి డీఎస్‌ఏ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ, చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ, ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానం పొందాయి. బాలికల విభాగంలో గుంటూరు జట్టు ప్రథమ, కృష్ణా జట్టు ద్వితీయ, ప్రకాశం జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. ఛత్తీస్‌ఘడ్‌లో నవంబరు ఆఖరి వారంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఏపీ జట్టును ఎంపిక చేశారు. టోర్నమెంట్ నిర్వహణకు డబుల్ హార్స్ సంస్థ, రోటరీ క్లబ్, స్వర్ణ హోటల్ సహకారం అందించారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.రవి కృతజ్ఞతలు తెలిపారు. హాకీ అసోసియేషన్ కోశాధికారి ఈదర వెంకటపూర్ణచంద్, సుధీర్‌బాబు, రమేష్‌బాబు, వినయ్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజి దిగువకు 32, 625 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తోన్న వరద ఉధృతి కొనసాగుతోంది పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 49, 217 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ప్రకాశం బ్యారేజికి చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యారేజి రిజర్వాయర్ వద్ద 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 45 గేట్లను అడుగు ఎత్తి దిగువకు 32,625 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 9,684 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 6,908 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 6908 క్యూసెక్కులు

దుగ్గిరాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 6908 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 32.625 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 306 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1748, తూర్పు కాల్వకు 515, పశ్చిమ కాల్వకు 180, నిజాంపట్నం కాల్వ కు 434, కొమ్మమూరుకాల్వకు 3040 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

361 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 361 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,000, గరిష్ఠధర రూ.11,600, మోడల్‌ధర రూ.11,600 పలికాయి. కాయ కనిష్ఠ రూ.9,000, గరిష్ఠ రూ.11,511, మోడల్‌ధర రూ.11,100 పలికాయి.

జిల్లాకు చేరిన వ్యాధి నిరోధక టీకాలు

గుంటూరు మెడికల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా గన్నవరంలోని రాష్ట్ర వ్యాక్సిన్ స్టోర్స్ నుంచి అక్టోబరు 25వ తేదీ శుక్రవారం అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు జిల్లా వ్యాక్సిన్ స్టోర్స్‌కు సరఫరా అయినట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వ్యాధి నిరోధక టీకాలను వెంటనే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సర ఫరా చేసినట్లు ఆయన వివరించారు. పసిపిల్లలకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు బుధ, శనివారాల్లో జరిగే ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో ఇస్తారని ఆయన తెలిపారు.

పోలీస్ క్వార్టర్లకు మోక్షం లేదా..?!

- రెండు దశాబ్దాలుగా నిరుయోగంగా ఉన్న క్వార్టర్లు
- మౌలిక వసతులు లేక ఖాళీ చేసిన సిబ్బంది
- శిథిలావస్థకు చేరుకున్న భవనాలు



శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వార్టర్లు

తాడికొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తాడికొండలో పోలీస్ క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. సుమారు రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్నాయి. 1992లో ఉన్న సిబ్బందికి రెండు భాగాలుగా క్వార్టర్లు నిర్మించారు. అప్పటి హోంమంత్రి ఆలపాటి ధర్మారావు భవనాలను ప్రారంభించారు. మొదట ఐదారేళ్లు ఎస్ఐలు, సిబ్బంది వాటిల్లో నివాసం ఉన్నారు. అయితే డ్రైయినేజీ, నీటి సమస్యలతో సిబ్బంది నివాసం ఉండటానికి ఇష్టపడలేదు. మౌలిక సదుపాయాల కొరత కారణంగా కూడా సిబ్బంది క్వార్టర్లు ఖాళీ చేశారు. పట్టించుకునే వారు లేక భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించటానికి వచ్చిన సిబ్బంది అద్దె భవనాల్లో నివాసం ఉంటున్నారు. అసలే రాజధాని రావటంతో ఇంటి అద్దెలు అధికంగా పెరిగాయి. దీంతో అధికంగా అద్దెలు చెల్లించి స్థానికంగా నివాసం ఉంటున్నారు. దీని వల్ల సిబ్బందికి ఇంటి అద్దెల రూపంలో ఖర్చులు విపరీతంగా పెరిగాయి. క్వార్టర్లను వినియోగంలోకి తీసుకురావటం వల్ల సిబ్బంది ఖర్చులు తగ్గుతాయని కొంత మంది భావిస్తున్నారు. కాగా తాడికొండ రాజధాని ప్రాంతమైనందున రానున్న కాలంలో పోలీసు సిబ్బందిని పెంచే అవకాశాలు ఉండవచ్చు. ఈ నేపథ్యంలో శిథిల క్వార్టర్లను తొలగించి, కొత్త భవనాలను నిర్మిస్తే, సిబ్బందికి సౌలభ్యంగా ఉంటుందని పోలీసువర్గాలు భావిస్తున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పరిశీలించాల్సి ఉంది.

కార్పొరేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్

మంగళగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వివిధ రంగాలకు చెందిన కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కార్మికులు ఎంటీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రతినిధులు మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్స్‌కు మూడు మాసాల నుంచి కాంట్రాక్టర్ వేతనాలను చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వారం రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్ కిమ్మనకుండా ఉన్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు ఏళ్ల తరబడి ఇంకా కాంట్రాక్టు కార్మికులుగానే కొనసాగుతున్నారన్నారు. వారిని తక్షణమే ఆప్కాస్‌లో చేర్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కిల్, సెమీ స్కిల్ క్వాలిఫికేషన్ ఆధారంగా జీతాలను చెల్లించాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలను అందించాలని, పని భద్రతను కల్పించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కమిషనర్ కె.శకుంతలకు అందజేశారు. ఈ ఆందోళనకు సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ, అధ్యక్షుడు వై కమలాకర్‌రావు, తాడేపల్లి ప్రాంత సీఐటీయూ నాయకులు వెంకటరెడ్డి, ఎం భాగ్యరాజ్ నాయకత్వం వహించారు.

యాదవపాలెంలో నారా లోకేశ్ ఆరోగ్యసంజీవని సేవలు

దుగ్గిరాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో నారా లోకేశ్ సంజవనీ ఆరోగ్యరథం ద్వారా వైద్య సేవలను సోమవారం నిర్వహించారు. స్థానిక యాదవపాలెంలో శ్రీకృష్ణ మందిరం వద్ద ఏర్పాటు చేసిన వైద్యపరీక్షా శిబిరంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకూ రోగులకు పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, బీపీ, ఈసీజీ, సాధారణ వైద్యపరీక్షలను 140 మందికి నిర్వహించారు. అనంతరం మందులు అవసరమైన వారికి ఉచితంగా అందించారు. నక్కా చిరంజీవి, శ్రీనివాస్, వరదరాజులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మార్చి 31నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

- గృహ నిర్మాణశాఖ ఏఈ

దుగ్గిరాల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన నివేశనస్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు వచ్చే 2025 మార్చి 31 నాటికి పూర్తిచేయకుంటే బిల్లులు రావని గృహనిర్మాణశాఖ ఏఈ సుబ్బారావు అన్నారు. ఈమనిలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎంపీడీవో ఏ శ్రీనివాస్, స్థానిక కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవాటికి బిల్లులు వస్తాయన్నారు. మార్చి 31 తర్వాత నిర్మించినప్పటికీ పేదల గృహ నిర్మాణం కింద బిల్లులు రావని అన్నారు. మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయి చైతన్య, ఎంపీటీసీ గ్యారా నిర్మల, జనసేన మండల అధ్యక్షుడు పసుపు లేటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కాబోతు దేవదాసు, కాసరనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

తాడికొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులందరూ వారి ఓటుని నమోదు చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు కోరారు. సోమవారం తాడికొండలోని రావి చెట్టు సెంటర్లో పట్టబద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఓటు నమోదు కోసం ఆధార్‌కార్డు, ఓటు కార్డు, ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో పాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటోను దరఖాస్తు ఫారంనకు అనుసందానం చేయాలన్నారు. కార్యక్రమంలో ధనేకుల హరిబాబు, చొప్పర యాకోబు, ఉండవల్లి రాజేష్, కొలికపూడి శివ, షేక్ రఫీ, జిల్లా బీజేపీ మైనార్టీ సెల్ మెంబర్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

● తుళ్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు సినిమాహాలు సెంటర్ వద్ద ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని టీడీపీ నేతలు ప్రారంభించారు. ప్రతి గ్రామంలో టీడీపీ నేతల వద్ద దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివారావు తుళ్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు, మాజీ అధ్యక్షుడు బండ్ల పట్టయ్య మండల యువత అధ్యక్షుడు మూల్పూరి నరేష్, తాడకొండ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, నాయకులు ఉప్పలపాటి సాంబశివరావు, జమ్ముల అనిల్ బండ్ల శ్రీనివాసరావు, సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ పార్టీ సభ్యత్వం,ఎమ్మెల్సీ ఓటు నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

కంటి వైద్యశిబిరం ప్రారంభం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సంధ్య కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం డోలాస్‌నగర్‌లో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని టీడీపీ గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేమూరి మైనర్‌బాబు ప్రారంభించారు. వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జనచైతన్య ప్రచార కమిటి అధ్యక్షుడు మాచర్ల ఏసోబు, సంధ్య కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవో తనిఖీ

కాకుమాను, అక్టోబరు 28: కాకుమాను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎస్సీ)ను సోమవారం ఎంఈవో కేఎఫ్ కెన్నడీ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, పఠన సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత తనిఖీ చేశారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరని తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దుకాణాల వద్ద నిబంధనలు పక్కాగా పాటించాలని, కాలుష్య, శబ్ద రహిత గ్రీన్ దీపావళి, నిర్వహించుకోవాలని సూచించారు. నివాసాలు, రద్దీ కూడళ్లలో దుకాణాలు ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు.

డీఈవోగా సీవీ రేణుక

గుంటూరు(విద్య), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): డీఈవోగా సీవీ రేణుక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా డీఈవోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరు డీఈవోగా రేణుక బాధ్యతల స్వీకరించారు. రేణుక 2008లో డీవైఈవోగా వైజాగ్‌లో తొలి పోస్టింగ్ తీసుకున్నారు. అనంతరం డీఈవోగా పదోన్నతి పొందారు. కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లాలో డీఈవోగా పని చేశారు. తాజాగా గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన సీవీ రేణుకకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. విభాగాల వారీగా శుభాకాంక్షలు తెలిపారు.

సమష్టిగా ప్రజలకు సేవ చేయాలి

కూటమి నేతలతో ఇన్‌ఛార్జ్ మంత్రి దుర్గేష్



ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసిన ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమష్టిగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన్ని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రెండు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దీక్షాపరులకు అన్నదానం

పెదనందిపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సోమేశ్వరస్వామి కాలక్షేప మండపంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం దీక్షాపరులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 21 సంవత్సరాలుగా ప్రతి ఏటా దాతల సహకారంతో 41 రోజుల పాటు ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గొట్టిపాటి శంకరగురుస్వామి అయ్యప్పస్వామికి పీఠం ఏర్పాటు చేసి, స్వామి వారికి విశేష పూజలు భజనా కార్యక్రమం నిర్వహించారు.

నృసింహుడి భక్తులకు ఇకపై శుద్ధ జల ప్రసాదం

- మంత్రి లోకేశ్ స్ఫూర్తితో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు
- దివీస్ లాబొరేటరీస్ సంస్థ సేవా నిరతి
- వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ అనురాధ



ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

మంగళగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి లక్ష్మీనృసింహస్వామి భక్తులకు ఇకపై శుద్ధి చేసిన జల ప్రసాదం అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో దివీస్ లాబొరేటరీస్ సంస్థ నృసింహస్వామి దేవస్థానంతోపాటు పట్టణంలోని పలుచోట్ల రక్షిత మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. నృసింహస్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి ప్లాంట్లను ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఒక్కో ప్లాంటు రూ.16 లక్షల వ్యయం, 15 వేల లీటర్ల సామర్థ్యంతో నాలుగు రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ దివీస్ సంస్థ సహకారంతో మంగళగిరి నియోజకవర్గంలో 19 మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. మంగళగిరిలో ఇప్పటికే 6 ప్లాంట్లను ఏర్పాటు చేయగా, ఏపీ, తెలంగాణలోని ప్రముఖ ఆలయాల్లో 121 రక్షిత మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్న దివీస్ సంస్థకు ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో మంత్రి లోకేశ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే జలధార పేరుతో పలుచోట్ల రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి పేద పిల్లలను చదివించడం, గ్రామాల్లో మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేయడం, వరదల సమయంలో బాధితులకు అండగా నిలవడం వంటి అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ మంగళగిరి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని చెప్పారు. మంగళగిరి ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయడం, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ వంటి హామీలను త్వరగా అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్, దివీస్ లాబొరేటరీస్ ప్రతినిధులు నాగేష్, శ్రీనివాసరావు, రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, దేవస్థానం ఉప కమిషనరు అన్నపరెడ్డి రామకోటిరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ సమస్యను పరిష్కరించండి

- కలెక్టరుకి నల్లమడ రైతుసంఘం నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నల్లమడ రైతుసంఘ నేతలు

పెదనందిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఛానెల్ పొడిగింపునకు నిధులు కేటాయించి, భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసి తాగు, సాగు నీరు అందించాలని కోరుతూ సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మికి నల్లమడ రైతు సంఘ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లమడ వాగు వరద నివారణకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు. గుంటూరు ఛానెల్ పొడిగింపునకు నిధులు కోరుతూ శాంతియుతంగా నిరసన తెలిపిన రైతులు, మహిళలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు, యార్లగడ్డ అంకమ్మచౌదరి, లావు అంకమ్మచౌదరి, డి హరిబాబు, నాయుడు సుబ్బారావు, మన్నవ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆదేశించినా న్యాయం జరగలేదు

ఎస్పీని ఆశ్రయించిన వైసీపీ బాధితురాలు వెంకాయమ్మ



బాధితురాలు వెంకాయమ్మ

గుంటూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తన ఇంటిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని తన స్థలాన్ని తనకు కేటాయించమని ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినా క్షేత్రస్థాయిలో తనకు నేటికీ న్యాయం జరగలేదని తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన కర్లపూడి వెంకాయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. కంతేరు గ్రామంలో తన తండ్రి ద్వారా తనకు సంక్రమించిన నాలుగున్నర సెంట్ల స్థలంలో సెంటున్నర స్థలాన్ని పక్కింటి వారు కబ్జా చేసి గోడ కట్టారన్నారు. దీనిపై ప్రశ్నించినందుకు గత వైసీపీ ప్రభుత్వంలో తనపై దాడి చేసి కొట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను వైసీపీ వారిపై ఎదురు తిరగడంతో దాడి చేశారని, అప్పట్లో ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు న్యాయం చేయాలని నేరుగా సీఎం చంద్రబాబు నాయుడుని కలవగా ఆయన తన స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణలను తొలగించాల్సిందిగా, అదే విధంగా డయాలసిస్ పెన్షన్ వెంటనే మంజూరు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. అంతేగాక తన కుమారుడికి ఉద్యోగం కూడా ఇప్పించారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో వచ్చిన సంబంధిత అధికారులు, సర్వేయర్లు గత నెల 20న సర్వే చేసి తన స్థలం కబ్జాకు గురైన మాట వాస్తవమేనని చెప్పి వెళ్లారే కానీ ఇంతవరకు తన స్థలాన్ని తనకు ఇప్పించలేదని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశించినా క్షేత్రస్థాయిలోని అధికార యంత్రాంగానికి నేటికీ వైసీపీ వాసన పోలేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

తాడేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్, వాల్యూ ఎడ్యుకేషన్ విభాగాలు సంయుక్తంగా సోమవారం వర్సిటీలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మానసిక ఆరోగ్య ఆవశ్యకతపై ర్యాలీ చేపట్టారు. అనంతరం 'విద్యార్థుల జీవిత లక్ష్యసాధనలో మానసిక ఆరోగ్యం ఎలాంటి పాత్ర పోషిస్తుంది' అనే అంశంపై వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ప్రముఖ మానసిక ఆరోగ్య నిపుణులు అనుమకొండ అనంత్‌కుమార్ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. హైకోర్టు న్యాయమూర్తి పోలిశెట్టి సుభాషిణి జెండర్ సెన్సిటైజేషన్ అంశంపై విశదీకరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ పార్థసారధివర్మ, ప్రోవీసీలు ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ కే.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి ప్రసాద్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ రూత్‌రమ్య, సైకాలజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఫిరంగిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం డ్వామా పీడీ శంకర్ అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో జరిగిన వివిధ పనులను సామాజిక తనిఖీ డీఆర్‌పీలు పరిశీలించారని తెలిపారు. మొత్తం 1088 పనులు చేశారని, రూ 13,29,12,967లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. సోషల్ ఆడిట్ బృందం ఎస్ఆర్‌పీ రాజు నేతృత్వంలో తొమ్మిది బృందాలుగా 17 గ్రామ పంచాయతీల్లో ఆడిట్ చేశారన్నారు. వివిధ అభివృద్ధి పనుల రికార్డులను పరిశీలించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ సహేల నర్గీస్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ఎన్ సోమయాజులు, జిల్లా అంబుడ్స్‌మెన్ ఎం కౌముది, ఎస్ఆర్‌పీ రామచంద్ర, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎం శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రాజెక్ట డైరెక్టర్ శివన్నారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ బీ విజయలక్ష్మి, ఎం సుమలత, ఏపీవో జయ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా శ్రీనివాస్



కాసరగడ్డ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న కొల్లి శేషు

తాడేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం చిర్రావూరు టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా కాసరగడ్డ శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాసరగడ్డను శేషు సత్కరించారు. కార్యక్రమంలో నల్లి బోయిన శ్రీనివాసరావు మొక్కపాటి మధు, మొక్కపాటి యేసు ప్రసాద్, మేకల నాగయ్య, మేకల వెంకటకృష్ణారావు, సాంబయ్య, అప్పారావు, వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులు.. రైతులకు పాట్లు

- ఒకే సర్వే నెంబరులో భూమి తగ్గిందంటూ 14 మంది రైతుల ఫిర్యాదులు



తహసీల్దార్‌కు అర్జీని అందజేస్తున్న రైతులు

ప్రత్తిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో నాడు అధికారులు చేసిన తప్పులు ఇప్పుడు రైతులకు శాపంగా మారింది. తమకు తెలియకుండానే తమ భూమి కనిపించకుండా పోయిందంటూ సోమవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రైతులు ఫిర్యాదు చేశారు. ప్రత్తిపాడుకు చెందిన సర్వే నెంబరు 762లో 3.92 ఎకరాల భూమి ఉంది. అయితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో అదే సర్వేనెంబరులో 2.40 సెంట్లు భూమి ఉన్నట్లు రికార్డు అయింది. ఈ నెంబరులో 14 మంది రైతులు ఉన్నారు. ఇటీవల తమ భూములను చూసుకున్న వారు నిర్ఘాంతపోయి అంత భూమి తగ్గటం ఏమిటి.. తమకు ఎలాంటి సమాచారం లేకుండా అధికారులు వారి ఇష్టమొచ్చినట్టు ఎలా తీస్తారు అంటూ తహసీల్దార్ కరుణకుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

'చలపతి'లో ఉచిత మెగా వైద్యశిబిరం

తాడికొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో అశోక్ లేలాండ్ ఆటోమోటివ్, అపోలో టైర్స్ హెల్త్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాలలోని అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, డ్రైవర్లు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. బస్సు డ్రైవర్లకు కంటి పరీక్షలు చేపట్టి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ చేశారని, మందులు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు తరగతుల నిర్వహణపై ఫిర్యాదు

పెదనందిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రైవేటు పాఠశాలల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారని, సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం తహసీల్దార్ శంకరబాబుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. సెలవు దినాల్లోనూ క్లాసులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు భాగ్యరాజు, అభి, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల నమోదు సరికాదు

తాడేపల్లిటౌన్, అక్టోబరు 28(ఆంధ్ర జ్యోతి): న్యాయంగా తమకు రావాల్సిన బకాయిల కోసం దశాబ్దాలుగా ఎదురు చూసి చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో భూముల్లోకి దిగిన తాడేపల్లి ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులపై, వారికి అండగా నిలిచిన కార్మిక నేతలపై ఎన్నారై ప్రతినిధులు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో తాడేపల్లి పోలీసులు కేసులు నమోదు చేయడం సరికాదని సీపీఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పులు అమలు చేయమని కోరితే అక్రమ కేసులు ఎందుకు పెడతారని ప్రశ్నించారు. కేసులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నేతలు కంచర్ల కాశయ్య, వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్ తదతరులు పాల్గొన్నారు. ఈ విషయమై సోమవారం సాయంత్రం సిమెంటు ఫ్యాక్టరీ యూనియన్ నేతలు తాడేపల్లి సీఐ బత్తుల కళ్యాణ్‌రాజు స్టేషన్‌కు పిలిపించారు. కేసులో వున్న 22 మందిని పిలిపించాలని ఆదేశించారు.

కొనసాగిన క్రీడాకారుల ఎంపిక



ప్రాక్టీస్‌లో నిమగ్నమైన క్రీడాకారులు

మంగళగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న మంగళగిరి ప్రీమియం లీగ్ సీజన్ 3 క్రికెట్ పోటీలకు ఎంపిక కార్యక్రమం రెండో రోజు నవులూరు క్రికెట్ స్టేడియంలో కొనసాగింది. మంగళగిరి నియోజకవర్గం నుంచి ఒక జట్టు పాల్గొననుంది. ఈ రెండు రోజుల్లో 32 మంది బెస్ట్ ప్లేయర్స్‌ని ఎంపిక చేసి, ఏబీ జట్లుగా విభజించారు. వారితో ప్రాక్టీస్ చేయించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయిలో జరిగే మంగళగిరి ప్రీమియర్ లీగ్, సీజన్3లో మంగళగిరి జట్టు తరఫున పాల్గొంటారు.

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత



సైకిళ్లు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తాడేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, హైదరాబాద్ నార్త్ వెల్‌జాన్ ప్రాజెక్టు సంయుక్త సహకారంతో సోమవారం పేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. తాడేపల్లి బైపాస్ రోడ్డులోని గోపు హెచ్‌పీసీ బంకు వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాడేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు రావూరి రమేష్‌బాబు, సుకుమార్‌రెడ్డిలు విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తున్న తెలుగుమహిళలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ కొన్నేళ్లుగా స్థానికంగా స్త్రీశక్తి - సంక్షేమం పేరుతో మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కేంద్రంలో 66వ బ్యాచ్‌లో 30 మంది మహిళలకు శిక్షణ పూర్తయిన సందర్భంగా సోమవారం వారికి ఉచితంగా కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తాడేపల్లి ప్రాంతానికి చెందిన 30 మంది మహిళలు 60 రోజులపాటు ఈ కేంద్రంలో శిక్షణ తీసుకున్నారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన ముగింపుసభలో తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి వింజమూరి ఆషాబాల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంచికలపూడి వైష్ణవి, కొయ్యగూర మహాలక్ష్మి, బొర్రా కృష్ణవందన, కాటాబత్తుని నిర్మల, ట్రైనర్ అరుణ పాల్గొన్నారు.

యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వట్టిచెరుకూరుకు చెందిన మహిళలు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. దాదాపు రూ.16లక్షల నిధులను పక్కదారి పట్టించిన వెలుగు యానిమేటర్ గోగినేని చంద్రావతిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన మహిళలు అర్జీ అందజేశారు. గాయత్రీ గ్రామ సమైక్యకు చెందిన 32 గ్రూపులకు చెందిన పొదుపు సొమ్మును ఆమె స్వాహా చేసిందని తెలిపారు. దీనిపై అప్పటి ఏపీఎం, సీసీలకు ఫిర్యాదు చేసిన పట్టించు కోలేదని వాపోయారు. ఈ మధ్యనే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేస్తే కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని తెలిపారు. ఉన్నాతాధికారులు స్పందించి పాత యానిమేటర్‌పై చర్యలు తీసుకుని, నిధులను గ్రూపులకు జమచేయాలని కోరారు.

రేపు చేబ్రోలులో జాబ్‌మేళా

చేబ్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సిడాప్ ఆధ్వర్యంలో అక్టోబరు 30వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చేబ్రోలు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ రామకృష్ణ సోమవారం తెలిపారు. చేబ్రోలు డిగ్రీ కళాశాలలో జరిగే ఈ జాబ్ మేళాకు జిల్లాలోని ఆసక్తి కలిగిన 10, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ అర్హత కలిగిన వారు జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాల కోసం 9666545974 నెంబరును సంప్రదించాల్సిందిగా సూచించారు.

జోన్ డైరీ

● ఉదయం 11గంటలకు మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో పురపాలక సంఘ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఓ ప్రకటనలో తెలిపారు.



కమిషనర్ శేషన్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ ఏసీపీ శివన్నారాయణ

పురపాలక సంఘ ఏసీపీగా శివన్నారాయణ

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘ నూతన మున్సిపల్ అసిస్టెంటు సిటీ ప్లానర్‌గా శివన్నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విజయవాడ సీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేసి ఆయన సాధారణ బదిలీలలో భాగంగా తెనాలి విచ్చేశారు. ఏసీపీగా ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న సుధాకర్ ఒంగోలు పురపాలక సంఘానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన శివన్నారాయణ కమిషనర్ శేషన్నను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

జిల్లాకు చేరిన వ్యాధి నిరోధక టీకాలు

గుంటూరు మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా గన్నవరంలోని రాష్ట్ర వ్యాక్సిన్ స్టోర్స్ నుంచి అక్టోబరు 25వ తేదీ శుక్రవారం అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు జిల్లా వ్యాక్సిన్ స్టోర్స్‌కు సరఫరా అయినట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వ్యాధి నిరోధక టీకాలను వెంటనే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసినట్లు ఆయన వివరించారు. పసి పిల్లలకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు బుధ, శనివారాల్లో జరిగే ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ప్రజావేదికకు 16 అర్జీలు

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 అర్జీలు అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు రెవెన్యూ సంబంధించి 4, డీఎల్‌పీవో 4, మున్సిపాలిటీ 3, పోలీసు 3, హౌసింగ్ 1, ఎంపీడీవో 1 సమస్యలను దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులను ఆయా శాఖలకు పంపి పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో 4 అర్జీలు

తెనాలి రూరల్, అక్టోబరు 28,(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయానికి ప్రజా సమస్యల పరిష్కావేదికకు 4 అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అందులో రెండు సర్వేకి రాగా, గుడివాడ డొంకలో దుగ్గిరాల కాఫీపొడి ఫ్యాక్టరీ సంబంధించిన వ్యక్తులు స్తంభాలు పాతారని వాటిని తొలగించాలని స్థానిక రైతులు ఒక వినతిపత్రం అందించారు.

మృతుడికి టీడీపీ నేతల నివాళి

పొన్నూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డిముక్కలలో తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పత్తెళ్ల పెద నరసింహారావు సోమవారం మృతి చెందారు. నరసింహారావు మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, చెల్లంశెట్టి సీతరామయ్య తదితరులు నరసింహారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బీసీలంతా గ్రాడ్యుయేట్ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ పట్టభద్రులంతా గ్రాడ్యుయేట్ దరఖాస్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీ నవ చైతన్య బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ కోరారు. సోమవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, కృష్ణా, గుంటూరు శాసన మండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి గతంలో ఉండే ఓటర్ల జాబితా రద్దు అవుతుందని ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు కోసం దరఖాస్తు, రెండు ఫొటోలు, ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్‌లను గెజిటెడ్ అధికారులతో ధ్రువీకరించి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని, నవంబరు 6 వరకు గడువు ఉందని తెలిపారు.

పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని లక్ష్మీనగర్‌లో పాల్‌రాజ్ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో బిషప్ జాన్‌పాల్ మాట్లాడుతూ, దైవజనులు ఐక్యంగా ప్రపంచ శాంతి కోసం ప్రార్థన చేయాలన్నారు. ప్రభుదాసు, అబ్రహం, ఆనందన్న, వరప్రసాద్, విక్టర్‌పాల్ పాల్గొన్నారు.

సమస్యల సుడిలో సర్కారు బడులు

● కనీస సదుపాయాలు కరువు ● అధ్వాన్న స్థితిలో పాఠశాలలు

కొల్లిపర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులు నానాటికి సమస్యలతో కునారిల్లుతున్నాయి. ఇక్కడ విద్యార్థులకు కనీస సదుపాయాలు లోపించాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం ఐన విధంగానే పాఠశాలలు కూడా అధ్వాన పరిస్థితికి దిగజారిపోయింది. పలు పాఠశాలల భవనాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో అధ్వాన పరిస్థితికి చేరాయి. డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో



అభివృద్ధికి నోచుకోని దావులూరు ప్రాథమిక పాఠశాల భవనం

47 ప్రభుత్వ పాఠశాలలకు రెండు సంవత్సరాలుగా రూపాయి గ్రాంటు ఇవ్వకపోవటంతో ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను నిర్వహించలేకపోయారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఏడాదికి రూ.75వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.25వేలు గ్రాంటు ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ నిధులు చెల్లించకపోవడంతో కరెంటు బిల్లులు, వేలల్లో పేరుకుపోయాయి. నిర్వహణ నిధులు ఇవ్వకపోవడం వలన చిన్నపాటి రిపేర్లు కూడా చేయలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మారటం స్కూల్ గ్రాంటు ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి అధికారులను ఆదేశించడం కొంతమేర ఊరట ఇచ్చింది. రెండేళ్ల పాటు సుద్దముక్కలు కూడా పాఠశాలల్లో లేని దుస్థితికి గత పాలన ఉంది. మండలంలో



దావులూరులో పాఠశాలకు ప్రహరీ లేక అధ్వానంగా ఉన్న పరిసరాలు

నాడు-నేడు పేరుతో పలు పాఠశాలలు అభివృద్ధి చేపట్టి మధ్యలోనే వదిలేశారు. సకాలంలో నిధులు ఇవ్వక పోవడం... అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించకపోవడం వలన పాఠశాలల ప్రాంగణాలు నిర్మాణ సామగ్రితో అసౌకర్యంగా మారాయి. ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలకు తరలించగా వాటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

నిధులు డ్రా చేయాలంటే పక్క జిల్లాకు వెళ్లాల్సిందే

ప్రభుత్వ పాఠశాలలకు స్కూల్ గ్రాంటు సకాలంలో నిధులు విడుదల చేయకపోవటంతో పాటు ప్రధానోపాధ్యాయులు నిధులు డ్రా చేయాలంటే అనేక ఇబ్బందులు తప్పటం లేదు. కొల్లిపర మండలానికి ప్రాథమిక పాఠశాలలకు, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన స్కూల్స్ అభివృద్ధికోసం ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు కొల్లూరులో ఉన్న యూనియన్ బ్యాంకులో నిధులు జమ కావటంతో ప్రధానోపాధ్యాయులు అనేక ఇబ్బందుల పడాల్సి వస్తుంది. గుంటూరు జిల్లా నుంచి బాపట్ల జిల్లా మారినగాని స్కూల్ గ్రాంటు నిధులు డ్రా చేయడం కోసం బాపట్ల జిల్లా కొల్లూరుకు ప్రధానోపాధ్యాయులు వెళ్లాల్సి వస్తుంది. దీంతో స్కూల్ గ్రాంటు నిధులు డ్రా చేయాలంటే అనేక అవస్థలు పడాల్సి వస్తోందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఈ విషయాన్ని అనేక పర్యాయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోవడంలేదని స్కూల్స్ వచ్చే నిధులను గుంటూరు జిల్లా తెనాలి యూనియన్ బ్యాంకులో జమ చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

పొన్నెకంటి మృదుభాషిణి సేవలు చిరస్మరణీయం: మంద కృష్ణమాదిగ

తెనాలి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కరుణా నిలయం విద్యాసంస్థల కరస్పాండెంట్ దివంగత పొన్నెకంటి మృదుభాషిణి అందించిన సేవలు చిరస్మరణీయమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం మండలంలోని కొలకలూరులో దివంగత పొన్నెకంటి మృదుభాషిణి సంస్మరణసభను కుటుంబసభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, టీడీపీ సీనియర్ నాయకులు డొక్క మాణిక్యవరప్రసాద్‌లు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మృధుభాషిణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మందకృష్ణమాదిగ

అనంతరం జరిగిన సంస్మరణసభలో విద్యావేత్తగా, ఉపాధ్యాయురాలిగా మృదుభాషిణి అందించిన సేవలను కొనియాడారు. విశ్రాంత ఉపాధ్యాయులు డీఎం లూథర్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో కుటుంబ సభ్యులు పొన్నెకంటి మంజుల, పీబీ కరుణాకర్, పొన్నెకంటి ప్రత్యూష్, డాక్టర్ ప్రభావతి, పి.సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు ఎన్. వెంకటేశ్వరరావు, ఎ.లక్ష్మిసామ్రాజ్యం, జి.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ శోభామంజిరి, డాక్టర్ పద్మావతి, మాజీ సర్పంచ్ వల్లూరి వరప్రసాదరావు, వై.రవికిరణ్, ఎ.సుదీప్, సందీప్, బీసీ సంక్షేమ సంఘం నియోజవర్గ అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పి.హేమలత, డాక్టర్ చైతన్య, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయండి

● డీలర్లు, ఆపరేటర్ల సమావేశంలో తహసీల్దార్

తెనాలి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత సమయంలోపు కార్డుదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దార్ గోపాలకృష్ణ ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండలంలోని రేషన్‌డీలర్లు, వాహన ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

650 కిలోల కంచుతో ఎన్టీఆర్ భారీ విగ్రహం

తెనాలి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి శిల్పులు ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని రూపొందించారు. కాటూరి శిల్పశాలలో పదిన్నర అడుగుల ఎత్తులో కాంస్య విగ్రహాన్ని తయారు చేశారు. చిత్తూరు జిల్లా కృష్ణాపురంలో ఆవిష్కరించేందుకు గాను నిర్వాహకులు ఆర్డర్ ఇచ్చారని, 650 కిలోల కంచుతో విగ్రహాన్ని తయారు చేయడానికి రెండు నెలల సమయం పట్టిందని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తెలిపారు. విగ్రహాన్ని మంగళవారం ఆ జిల్లాకు తరలిస్తామన్నారు.



ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహంతో శిల్పులు వెంకటేశ్వరరావు, రవిచంద్ర

తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలి

● ఏపీఎం రమాదేవి

కొల్లిపర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లకు, డ్వాక్రా మహిళలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మండలంలో ఈ సంవత్సరం 502 గ్రూపులకు 20 కోట్ల 64లక్షల రూపాయల రుణాలను డ్వాక్రా మహిళలకు ఇవ్వడం జరిగిందన్నారు. డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువ చేసుకుంటే ఎక్కువ రుణాలు పొందటానికి వీలు కలుగుతుందన్నారు. స్త్రీనిధి ద్వారా కూడా 418 గ్రూపులకు 20కోట్ల 64 లక్షల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు స్త్రీనిధిలో కూడా పొదుపు చేసుకోవాలన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ప్రతినెల సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, ఎమ్ఎస్‌ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రమాదేవి

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. సుల్తానాబాదులోని సుందరయ్యనగర్‌లో సోమవారం ఇంటింటికి సర్వే నిర్వహించి దోమల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని అధికారులతో కలిసి మురళీకృష్ణ సుబ్బరాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలలోని నీటిని తొలగించాలన్నారు. ఎవరికైనా వైద్య సహాయం అవసరమైతే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోగాని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత పరీక్షలతో పాటు అవసరమైన మందులను కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి రాజునాయక్, ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్రమౌళి, సహాయ మలేరియా అధికారి ఉమాకాంత్, వి.పున్నారెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాంసం, చేపల దుకాణాలు మూయించండి

● ఎంపీడీవోకు మాజీ ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణమూర్తి ఫిర్యాదు

పెదకాకాని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీక మాసాన్ని దృష్టిలో పెట్టుకొని పెదకాకాని జాతీయ రహదారి నుంచి శివాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా మాంసం, చేపల దుకాణాలను ఒక నెలరోజుల పాటు మూయించాలని పెదకాకాని మాజీ ఉపసర్పంచ్ బెజవాడ కృష్ణమూర్తి కోరారు. సోమవారం ఈ మేరకు పెదకాకాని ఎంపీడీవో శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ మూడు మతాలకు ప్రసిద్ధి చెందిన పెదకాకాని పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందన్నారు. కార్తీక మాసం నెలరోజుల పాటు శివాలయం కెళ్ళే రహదారికి ఇరువైపులా ఎటువంటి మాంసాహారం, చేపల విక్రయాలను నిషేధించాలని కోరారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పొన్నూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో ప్రజారోగ్యం, పర్యావరణం, పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అయితే కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు, శెలవులు, రక్షణ పరికరాలు ఇవ్వటంలో జాప్యం జరుగుతుందని ఆరోపించారు. పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సైతం పెంచాలని కోరారు. వారంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. పనిముట్లు రక్షణ పరికరాలు భద్రతా సౌకర్యాలు, యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలువంటి సౌకర్యాలు సకాలంలో అందించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలులో ఉన్న లోపాలను సరిద్దిదాలని కోరారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్మికుల స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఆధారంగా వేతనాలు చెల్లించటం కనీస వేతనంగా రూ.21వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై తక్షణ పరిష్కారం చూపాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కమిషనర్‌కు వినతి పత్రం అందచేసిన వారిలో కార్మిక సంఘాల నాయకురాలు పి.భూషమ్మ, ఎన్.మంగమ్మ, కె.సంపూర్ణ, డి.రాజేశ్వరి, పి.నాగరాజు, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఎదుట ఎమ్మెల్సీ ఓట్ల నమోదు సహాయక కేంద్రం

పెదకాకాని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద టీఎన్‌టీయూసీ-టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కృష్ణా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు ఓట్ల నమోదు కేంద్రం ఏర్పాటు చేయటం జరిగిందని విశ్వవిద్యాలయం టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు విష్ణు ప్రసాద్ తెలియజేశారు. టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బత్తుల హేమంతకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల ఎన్నికలో పాత ఓటరు లిస్టు ఉండదని, అందరూ నూతనంగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు గోపీచంద్, హరీష్ యశ్వంత్, శిరీష్, విజయ్, భాను ప్రకాష్, స్వామి, సాయి, మోహన్ ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. పట్టణ పురపాలక సంఘంలో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కమిషనర్ శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పారిశుధ్య విభాగానికి, ఇంజనీరింగ్ విభాగాలకు చెరో రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సత్వరమే సంబంధిత శాఖల అధికారులతో కలసి చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

జీవనశైలితో రక్తపోటును అదుపుచేయవచ్చు

● పీహెచ్‌సీ వైద్యుడు షేక్ హనీఫ్



తెనాలి రూరల్, అక్టోబరు 28,(ఆంధ్రజ్యోతి): మంచి జీవనశైలినితో రక్తపోటును (బీపీ) అదుపులో ఉంచుకోవచ్చని సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యులు షేక్ హనీఫ్ తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధి సురేష్‌తో బీపీ నివారణపై డాక్టర్ హనీఫ్ ఫటాఫట్..

ఫటా ఫట్



ప్రశ్న: బీపీ (రక్తపోటు) అంటే ఏంటి?

జవాబు: శరీరంలో రక్తాన్ని సరఫరాచేసే ధమనులపై అధిక ప్రభావం చూపడాన్ని రక్తపోటు (బీపీ) లేదా హైపర్ టెన్షన్ అని పిలుస్తారు. హైబీపీ ఉన్న వారిలో ధమని గోడలపై రక్తం నెట్టే శక్తి చాలా ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా గుండె రక్తాన్ని పంపింగ్ చేయడానికి ఎక్కువగా కష్టపడాల్సి ఉంటుంది. దీని ప్రభావం కిడ్నీపై కూడా పడుతుంది.

ప్ర: రక్తపోటును ఎలా తెలుసుకుంటారు?

జ: రక్తపోటును మిల్లీమీటర్ల పాదరసం (ఎమ్ఎమ్ హెచ్‌జీ)లో కొలుస్తారు. సాధారణ రక్తపోటు 120/80 ఎమ్ఎమ్ హెచ్‌జీ కంటె తక్కువగా, రక్తపోటు.. ఎగువ సంఖ్య 120 నుంచి 129ఎమ్ఎమ్ హెచ్‌జీ వరకు ఉంటుంది.

ప్ర: బీపీకి సరైన వైద్యం పొందకపోతే ఎటువంటి ప్రమాదాలు జరగవచ్చు?

జ: చికిత్స చేయని అధిక రక్తపోటు గుండెపోటు, స్ట్రోక్, కిడ్నీ వ్యాధులు ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతాయి.

ప్ర: బీపీని ఎలా అదుపులో ఉంచుకోవచ్చు?

జ: ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లు, ధూమపానానికి దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మంచి ఆహారం తీసుకోవడం వంటివి అధిక రక్తపోటును నివారించడంలో సహాయ పడతాయి.

ప్ర: లక్షణాలు ఎలా గుర్తించాలి?

జ: బీపీ ఉన్న వ్యక్తుల్లో అధిక శాతం మందిలో లక్షణాలేమి కనిపించవు. అతి తక్కువ మందిలో మాత్రమే రక్తపోటు రీడింగ్ ప్రమాదకరమైన స్థాయికి చేరుకున్నప్పుడు తలనొప్పి, ఊపిరాడకపోవడం, ఇతర లక్షణాలు కలిగిస్తాయి. అయితే ఇవి రక్తపోటువే నని మనం నిర్ధారణ చేసుకోలేం.



బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ అంజని ప్రియదర్శిని

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

● మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ అంజని ప్రియదర్శిని

పొన్నూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వసతి గృహలోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఎం.అంజని ప్రియదర్శిని ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని మేజిస్ట్రేట్ సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో భోజనశాలను సందర్శించారు. విద్యార్థులు ఉపయోగించే హాస్టల్ గదులను తనిఖీ చేశారు. అలాగే టాయిలెట్లు, హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటునట్లయితే న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించాలని సూచించారు. తనిఖీలో కోర్టు సూపరింటెంట్ ఎం.హరీష్ బాబు, కోర్టు సిబ్బంది, వసతి గృహ నిర్వాహకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థికసాయం

తెనాలి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితురాలికి నందివెలుగు భరోసా స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు అండగా నిలిచారు. విజయవాడ గాంధీనగర్‌కు చెందిన భూపతి సునీత అనే యువతి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యసేవలకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న నందివెలుగు భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కటికి శ్రీకాంత్, సభ్యులు నరిశెట్టి మహేష్, ఆరిశెట్టి శివన్నారాయణ, ఉమామహేష్‌లు సోమవారం యువతిని కలిసి వైద్యఖర్చుల నిమిత్తం రూ.15వేలు ఆర్థికసాయాన్ని అందించారు.



బాధితురాలికి ఆర్థిసాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు



నూతన డీఈవో ను అభినందిస్తున్న ఎంఈవో కుద్దూస్, ఉర్దూ డిఐ కాశీం, హెచ్ఎం అసోసియేషన్ నాయకులు తిరుమలేష్ తదితరులు

డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన సీవీ రేణుక

గుంటూరు (విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా సీవీ రేణుక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలను బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతన డీఈవోగా రేణుక బాధ్యతలు స్వీకరించారు. సీవీ రేణుక 2008లో డీవైఈవోగా వైజాగ్‌లో తొలి పోస్టింగ్ ప్రభుత్వ ఇచ్చింది. అనంతరం డీఈవోగా పదోన్నతి పొందారు. పదోన్నతిపై కృష్ణా జిల్లా ఎన్టీఆర్ జిల్లాలో డీఈవోగా పనిచేశారు. తాజాగా పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన బదిలీల్లో సీవీ రేణుకను గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

డీఈవోకు అభినందనలు

జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సీవీ రేణుకకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. విభాగాల వారీగా తమను తాము పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుంటూరు ఎంఈవో కుద్దూస్, ఉర్దూ డీఐ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం ఎస్‌కెఎం డి.కాశీం, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు తిరుమలేష్ తదితరులు డీఈవోకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టభద్రుల ఓటు నమోదులో సమస్యలు పరిష్కరించాలి

పొన్నూరు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదులో ఉన్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని లగడపాటి వేణుగోపాల్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు దాఖలు చేశారు. నవంబరు 6వ తేదీలోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆదేశాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఓటర్ కార్డ్, ఫొటో, సెల్ నెంబరు ఆధారంగా దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే రెవెన్యూ సిబ్బంది వెరిఫికేషన్‌కు వచ్చి తిరిగి గజిటెడ్‌చేసిన సర్టిఫికెట్లు అందచేయాలని కోరుతున్నారన్నారు. దీనివల్ల ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవటంలో ఎలాంటి ఉపయోగం కనిపించటం లేదన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది గృహాలకు వెళ్లి వెరిఫికేషన్ చేసే సమయంలో సర్టిఫికెట్లు పరిశీలిస్తే సరిపోతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడి సంతకంతో గ్రామీణ పట్టభద్రులు ఓటుకు దరఖాస్తు చేసుకుంటే అప్లికేషన్‌ను తిప్పి పంపుతున్నారని అదేమని అడిగితే ప్రధాన ఉపాధ్యాయుడు గెజిటెడ్ కాదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని రెవెన్యూ సిబ్బంది ప్రధానోపాధ్యాయుడు అర్హుడు కాదని చెప్పటం సరికాదన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లగడపాటి వేణుగోపాల్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు దాఖలు చేశారు.